

మాచర్లలో ఐదేళ్లు పనులు చేయకుండా వదిలేసిన టిడ్కో గృహాలు



కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం

అగ్రస్థానంలో జిల్లాను నిలపాలి

● పారిశ్రామిక సమీక్షలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికరంగంలో జిల్లాని అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ నాగలక్ష్మి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో పారిశ్రామిక సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ ఆర్ వెంకటరావు మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి, కాంప్లెక్స్‌లు కట్టడానికి జిల్లాలో భూమి అందుబాటులో లేదన్నారు. కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ గాయత్రిదేవి మాట్లాడుతూ జిల్లాలో వివిధ పరిశ్రమలు, ఇతర ప్రదేశాలలో పనిచేస్తున్న బాలకార్మికులను గుర్తించి వారిని బయటకు తెచ్చి యాజమాన్యంపై కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. గుంటూరులో 140కు పైగా కోల్డ్ స్టోరేజ్‌లు ఉన్నా అగ్నిప్రమాదం జరిగిన వెంటనే తెలియజేసే మెకానిజం అందుబాటులో లేదని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ శ్రీనివాసరావు తెలిపారు. చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వనజ మాట్లాడుతూ రత్నాలచెరువులో 400 మంది చేనేత కార్మికులకు షెడ్స్ నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలన్నారు. ఏపీఐఐసీ అధికారి జీవన్ మాట్లాడుతూ పొన్నూరు ఆటోనగర్ కోసం 20 ఎకరాల స్థలం గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాస్, డీడీ ఇండస్ట్రీస్ సుధాకర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సుభాని, కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ దొంగలపై కేసు

● విచారణకు ప్రత్యేక బృందం
● కిడ్నీ మార్పిడి ఘటనపై హోం మంత్రి సీరియస్


గుంటూరు, జూలై 9: కిడ్నీ దానం చేస్తే రూ.30లక్షలు ఇస్తామని లక్ష చేతిలో పెట్టి కిడ్నీ కాజేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. తనకు జరిగిన మోసంపై సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుచేసిన గుంటూరు కేవీపీకాలనీకి చెందిన గార్లపాటి మధుబాబు ఫిర్యాదు మేరకు మంగళవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. క్రోసూరు మండలం గరికపాడు గ్రామానికి చెందిన గార్లపాటి మధుబాబు వ్యాపారంలో నష్టాలతో 8లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ క్రమంలో ఫేస్‌బుక్‌లో కిడ్నీ డోనర్ కావాలన్న ప్రకటన చూసిన మధుబాబు విజయవాడకు వెళ్లాడు. కిడ్నీ దానం చేస్తే రూ.30లక్షలు ఇస్తామని ఆశ కల్పించి విడతల వారీగా రూ.లక్షా పదివేలు ఇచ్చి కిడ్నీ కాజేశారు. ఆపరేషన్ అనంతరం నగదు ఇవ్వాలని కోరగా వారు డబ్బులు ఇవ్వకుండా బెదిరించడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. కిడ్నీ కేసు దర్యాప్తునకు ప్రత్యేకబృందాన్ని ఏర్పాటుచేసినట్లు వెస్ట్ డీఎస్పీ మహేష్ తెలిపారు. డబ్బు ఆశ చూపి కిడ్నీ కాజేసిన ఘటనపై హోంమంత్రి అనిత సీరియస్ అయ్యారు.

టిడ్కో.. కసరత్తు

పేదలకు గృహయోగం.. కసరత్తు మొదలైంది. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా శ్రీకారం చుట్టిన టిడ్కో ఇళ్లను జగన్ ఐదేళ్లు పాడుపెట్టగా.. వాటిని పూర్తి చేసి పంపిణీ చేసే బాధ్యత కూడా చంద్రబాబే చేపట్టారు. 2014లో నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు పేదల కోసం ఆధునిక టెక్నాలజీతో టిడ్కో ఇళ్లను మున్సిపల్ కేంద్రాల్లో నిర్మించారు. పేదల సొంతింటి కల సాకారమవుతుందనే సమయంలో 2019లో ప్రభుత్వం మారింది. వైసీపీ అధినేత జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే టిడ్కో ఇళ్లను అర్ధాంతరంగా నిలిపి వేశారు. అప్పటికే పూర్తై.. గృహ ప్రవేశాలు జరిగిన ఇళ్లలో కూడా అరకొర పనుల ను ప్రభుత్వం పట్టించుకోకుండా ఐదేళ్లు కాలయాపనతో సరిపెట్టింది. ఒకవైపు టిడ్కో ఇళ్ల కోసం అప్పులు చేసి దానికి వడ్డీలు కడుతూ.. మరోవైపు అద్దె భారంతో పేదలు అల్లాడుతున్నా.. జగన్ ప్రభుత్వం పట్టించుకోకుండా అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తూ వచ్చింది. ఇక జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా తమకు టిడ్కో రావని పేదలు నిర్ణయించేసుకున్నారు. ఈ దశలో తాజా ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చంద్రబాబు నేతృత్వంలో అధికారం చేపట్టింది. దీంతో పేదలు తమకు గృహయోగం కలుగుతుందని ఆశించారు. వారి ఆశలకు తగినట్లుగానే టిడ్కో ఇళ్ల పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనల ను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మార్చి నాటికి టిడ్కో ఇళ్ల పనులు పూర్తి చేసి పేదల గృహయోగం సాకారం చేసేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు.

పేదలకు గృహయోగం దిశగా..

- గృహాల పూర్తికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- రూ.917 కోట్ల నిధులు మంజూరుకు అంగీకారం
- మార్చికల్లా 10,240 టిడ్కో ఫ్లాట్లు పంపిణీకి చర్యలు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా సొంత ఇంటి కోసం పేదలు కంటున్న కలలను కూటమి ప్రభుత్వం సాకారం చేసేందుకు సిద్ధమైంది. దీంతో పట్టణాల్లో పేదలు సొంత ఇంటి కల నెరవేర్చే దిశగా అధికారులు అడుగులు మొదలు పెట్టారు. ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటూ అనేక రకాలుగా అవస్థలు పడిన పట్టణ పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. అదే వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారం చేపట్టగానే రివర్స్ టెండర్ల పేరుతో దానిని తుంచేసింది. టీడీపీ హయాంలో చేపట్టిన వేలాది టిడ్కో గృహాలను పూర్తి చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాడుబెట్టింది. టిడ్కో ఇళ్ల నిధుల కేటాయింపును కూడా విస్మరించింది. ఈ పరిస్థితుల్లో తాజగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేసేందుకు సమాయత్తమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 10,240 గృహాలు పూర్తి చేసి వచ్చే మార్చి కల్లా పేదలకు గృహ యోగం కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. టిడ్కో గృహాలను పూర్తి చేసి పంపిణీ చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. టిడ్కో ఉన్నతాధికారులు సీఎం చంద్రబాబునాయుడుతో మంగళవారం భేటీ అయ్యారు. పేదల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంపై దృష్టి సారించాలని టిడ్కో అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మాచర్ల, వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, రేపల్లె, వెంగళాయపాలెం, తెనాలిలో నిలిచిపోయిన గృహాలను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేసే దిశగా ప్రభుత్వం సమాయత్తమైంది. చంద్రబాబు హయాంలో చేపట్టిన టిడ్కో గృహాలను తిరిగి తాజాగా అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వమే పూర్తి చేసి పేదల కల సాకారం చేయనున్నది. వైసీపీ ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేసిన వేలాది గృహాల పనులను తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం నడుం కట్టింది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పేదల్లో సొంత ఇంటిపై ఆశలు చిగురిస్తున్నాయి. నిలిచిపోయిన గృహాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా ఇళ్ల నిర్మాణ బకాయిలను చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. ఇళ్ల నిర్మాణం పూర్తితో పాటు మౌలిక వసతులను కల్పిస్తారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మిస్తారు. ఆయా పనులు పూర్తి చేసేందుకు, బకాయిలు చెల్లింపునకు రూ.917 కోట్లు అవసరం అవుతుందని ప్రతిపాదనలను టిడ్కో నుంచి ప్రభుత్వానికి అందాయి. మొత్తం 10,240 గృహాలను పూర్తి చేసి అన్ని వసతులు కల్పించి మార్చి కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

కక్షగట్టిన వైసీపీ ప్రభుత్వం

పేదలపై వైసీపీ ప్రభుత్వం కక్ష కట్టినట్లుగా టిడ్కో గృహాలను పూర్తి చేయలేదు. గృహాలను పంపిణీ చేయాలన్న పేదల మొరను పాలకులు వినిపించుకోలేదు. పనుల పూర్తి మాట ఎలా ఉన్నా నిర్మాణంలో ఉన్న గృహాలను గత ప్రభుత్వం బ్యాంకుల్లో తనఖా పెట్టింది. ఆ రుణాలతో పనులు చేయలేదు. పైగా ఆ నిధులను జగన్ ప్రభుత్వం మళ్లించుకున్నట్లు సమాచారం. టిడ్కో ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని టీడీపీ సహా ఇతర ప్రతిపక్షాలు, లబ్ధిదారులు ఆందోళనలు చేసినా నాటి పాలకులు పట్టించుకోలేదు. ఇళ్లు శిథిలమవుతున్నాయని, అసాంఘీక కార్యకలపాలకు నిలయాలుగా మారుతున్నాయని లబ్ధిదారులు వాపోయినా నిర్లక్ష్యం వీడలేదు. పండుగల పేర్లు చెబుతూ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను ప్రభుత్వం మభ్య పెడుతూ వచ్చింది. ఎన్నికలకు ముందు తొమ్మిది నెలల క్రితం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అయితే టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లో తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించకుండా ప్రజా ప్రతినిధులు హడావుడితో సరి పెట్టారు.

● వినుకొండలో టిడ్కో గృహాలు

పట్టణాల వారీగా పూర్తి చేయనున్న గృహాలు..

పట్టణం	గృహాల సంఖ్య
మాచర్ల	1056
వినుకొండ	1440
పిడుగురాళ్ల	2832
సత్తెనపల్లి	160
చిలకలూరిపేట	1008
వెంగళాయపాలెం	1392
తెనాలి	1008
రేపల్లె	1344

నాలుగున్నరేళ్లు నాన్చారు

టీడీపీ హయాంలో దాదాపు 90 శాతం పూర్తయిన ఇళ్లకు తుది మెరుగులు దిద్ది, మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లు నాన్చివేత ధోరణి అవలంబించింది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని టిడ్కో ఇళ్ల పంపిణీ 2019లో ఆగి పోయింది. అప్పటి నుంచి ప్రభుత్వం 2023 మే వరకు ఇళ్ల పంపిణీ చేసే యోచన చేయలేదు. కట్టిన ఇళ్లు శిథిలమవుతున్నాయని ప్రతిపక్షాలు, లబ్ధిదారులు ఆందోళనలు చేసినా ఆలకించలేదు. ఎన్నికల ఏడాది ప్రారంభంలో చేపట్టిన ఇళ్ల పంపిణీ హడావుడితోనే సరిపోయింది. సదుపాయాల కల్పన చేయకుండా పట్టాల పంపిణీతో జగన్ మాయ చేశారని అప్పట్లో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లయితే పంపిణీ చేశారు గాని నివాసాలకు కావాల్సిన కనీస వసతులను కూడా కల్పించలేదని ఇదే నాటి జగన్ చిత్తశుద్ధికి నిదర్శనమని లబ్ధిదారులు తెలిపారు.

సీడ్ యాక్సెస్.. సవాల్



- గత టీడీపీ హయాంలో 50 శాతం రోడ్లు పూర్తి
- ఎక్కడికక్కడ పనులు నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం
- పలు రోడ్లు తవ్వేసి.. సామగ్రి అపహరణతో అస్తవ్యస్తం
- వాటిని పునరుద్ధరించి రోడ్డు నెట్‌వర్కుపై సీఆర్‌డీఏ దృష్టి
- కేపిటల్ సిటీ రోడ్డు నెట్‌వర్కు పూర్తి చేస్తే అమరావతి అభివృద్ధి జెట్ స్పీడ్



సీడ్ యాక్సెస్ రోడ్డు


గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి.. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ. రోడ్ల అనుసంధానంతో రాజధాని అమరావతి అభివృద్ధిలో దూసుకెళ్తోంది.. అని అందరూ భావించారు. ఆ దిశగా నాటి టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ప్రణాళికలు రూపొందించి అమలు చేశారు. అమరావతి అన్ని ప్రాంతాలకు అనుసంధానం చేస్తూ సీడ్ యాక్సెస్ రోడ్ల నిర్మాణాలను పెద్దఎత్తున చేపట్టారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అమరావతికి శాపమైంది. అమరావతి రాజధాని భవితవ్యం కేపిటల్ సిటీ రోడ్డు నెట్‌వర్కుపై ఆధారపడినా వాటిని ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్లు పాడుబెట్టారు. పైగా అప్పటికే పూర్తి చేసిన రోడ్లను తవ్వేసి ఇసుక, కంకరను తరలించారు. నిర్మాణ సామగ్రిని అపహరించి సొమ్ము చేసుకోవడంపైనే నాటి పాలక పక్షం దృష్టి సారించింది. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టడంతో అమరావతి అభివృద్ధి పట్టాలెక్కింది. ఈ క్రమంలో సీడ్‌యాక్సెస్ రోడ్ల పూర్తి ప్రస్తుతం సీఆర్‌డీఏకు సవాల్‌గా మారింది.

238 కిలోమీటర్ల మేర..

దాదాపుగా 238 కిలోమీటర్ల మేరకు సీడ్ యాక్సెస్ రోడ్డు, మేజర్ ఆర్టీరియల్, ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రోడ్ల నిర్మాణం సవాలుగా మారింది. ఇందుకోసం సుమారుగా రూ.9 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేయాల్సి ఉన్నది. ఇప్పటికే వీటి నిర్మాణం ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని ప్రారంభ దశలో ఉంటే మరికొన్ని 30 శాతం, రెండు రోడ్లు 50 శాతం పైగా పూర్తి అయ్యాయి. కూటమి ప్రభుత్వం రాబోయే రెండేళ్లలో ఈ రోడ్ నెట్‌వర్కుని పూర్తి చేయగలిగితే అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ గృహాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు వంటివి నిర్మించడానికి పెద్దఎత్తున పెట్టుబడిదారులు తప్పక ముందుకు వస్తారని రాజధాని ప్రజలు భావిస్తున్నారు. రాజధాని నగరంలో అత్యంత కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు(ఈ 3 రోడ్డు)గా పరిగణిస్తారు. దీని పొడవు 18.27 కిలోమీటర్లు కాగా ప్రాజెక్టు ఖర్చు రూ.252 కోట్లు. ఇప్పటికే 67.80 శాతం పూర్తి అయింది. ఇది సంపూర్ణం అయితే చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారితో అమరావతి రాజధాని అనుసంధానం పూర్తి అవుతుంది. మరోవైపు చినకాకాని - గుండుగొలను జాతీయ రహదారి నిర్మాణం చివరి దశలో ఉన్నది. ఇది పూర్తి అయితే చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారితో పాటు విజయవాడ - హైదరాబాద్ రోడ్డుకు కనెక్టివిటీ వస్తుంది. దాంతో వాహనాల రాకపోకలు గణనీయంగా పెరుగుతాయి. రాజధానిలో 1 (రోడ్డు) ఈ08 కాగా దీని పొడవు 14.95 కిలోమీటర్లు. దీనికి రూ.319 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటికే 34.61 శాతం పని పూర్తి అయింది. 2(రోడ్డు) ఎన్9. దీని పొడవు 12.5 కిలోమీటర్లు. రూ. 252 కోట్ల అంచనా విలువతో చేపట్టిన ఈ రోడ్డు పని 50.74 శాతం పూర్తి అయింది. 3వ(రోడ్డు) ఎన్04, ఎన్ 14. దీని పొడవు 15.14 కిలోమీటర్లు కాగా రూ.312 కోట్ల అంచనాతో ఏపీసీఆర్‌డీఏ ప్రారంభించి 35.15 శాతం పూర్తి చేసింది. 4వ(రోడ్డు) ఈ10, ఈ14, ఎన్16 పొడవు 23.94 కిలోమీటర్లు. ఈ రోడ్డుని కూడా 2019కి ముందే అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.395 కోట్ల అంచనాతో ప్రారంభించి 24.70 శాతం పనిని పూర్తి చేసింది. 5వ(రోడ్డు) ఈ6 రోడ్డు పొడవు 9.85 కిలోమీటర్లు కాగా రూ.322 కోట్లతో ప్రారంభించి 10.66 శాతం పూర్తి చేసింది. 6వ రోడ్డు ఈ12 పొడవు 6.791 కిలోమీటర్లు. దీని నిర్మాణాన్ని రూ.265 కోట్లతో ప్రారంభించి 5.79 శాతం మాత్రమే పూర్తి చేయగలిగింది. 7వ రోడ్డు ఎన్ 11 పొడవు 8.657 కిలోమీటర్లు. ఈ రోడ్డు పూర్తి చేయడానికి రూ.327 కోట్ల నిధులు అవసరమౌతాయి. ఇప్పటివరకు 12.88 శాతం పని పూర్తి అయింది. సీరియల్ నెంబరు. 8, 9, 10లను ఈ10, ఈ14, ఎన్ 16, ఈ6, ఈ8, ఈ12, ఎన్ 11లో మౌలిక సదుపాయాల కోసం కేటాయించారు. ప్యాకేజ్ నెంబరు 8 వర్కులకు రూ.550 కోట్లు, 9లో ఉన్న పనులకు రూ.759 కోట్లు, 10లో ఉన్న వాటికి రూ.685 కోట్లు అవసరమౌతాయి. ఈ పనులు కూడా ప్రారంభమై 12 నుంచి 24 శాతం వరకు పూర్తి అయి ఉన్నాయి. 11(రోడ్లు, యుటిలిటీస్) ఈ2, ఈ4, ఎన్7 రోడ్డు పొడవు 32.737 కిలోమటర్లు కాగా రూ. 1,502 కోట్లతో పనులు ప్రారంభించిన ఎల్ అండ్ టీ సంస్థ 21.35 శాతం పూర్తి చేసింది. 12(రోడ్లు, యుటిలిటీస్) ఈ7, ఈ9, ఈ11, ఎన్3ఏ, ఎన్3బీ పొడవు 36.705 కిలోమీటర్లు కాగా రూ. 1429 కోట్లతో మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రారంభించి 24 శాతం పూర్తి చేసింది. 13(రోడ్లు, యుటిలిటీస్) ఎన్ 8, ఎన్10 రోడ్డు పొడవు 30.171 కిలోమీటర్లు కాగా ఎన్‌సీసీ సంస్థ రూ.1436 కోట్లతో చేపట్టి 13.50 శాతం పూర్తి చేసింది. 14(రోడ్లు, యుటిలిటీస్) ఈ16, ఎన్ 12, ఎన్15, ఎన్ 17 పొడవు 28.69 కిలోమీటర్లు కాగా రూ.1,301 కోట్లతో ఎన్‌సీసీ చేపట్టి 15.07 శాతం పూర్తి చేసింది. 15 రోడ్డు ఈ08, డబ్ల్యూఎస్ఐఎస్ పొడవు 13.96 కిలోమీటర్లు కాగా దీనిని కూడా ఎన్‌సీసీ చేపట్టింది. రూ.1,571 కోట్లతో నిర్మాణం ప్రారంభించి 8.77 శాతం పనిని పూర్తి చేసింది. వీటితో పాటు ఎన్ 13, ఈ5 రోడ్లకు మరో రూ.715.74 కోట్ల నిధులు అవసరమౌతాయి.

వైసీపీ హయాంలో విధ్వంసం

అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్‌లో కేపిటల్ సిటీ రోడ్డు నెట్‌వర్కు ప్లాన్‌కు అనుగుణంగా రోడ్ల నిర్మాణాలను అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేపట్టి కొంతమేరకు పూర్తి చేసింది. 2019లోనూ టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈపాటికే రోడ్డు నెట్‌వర్కు అంతా పూర్తి అయి ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం రావడంతో ఎక్కడికక్కడ పనులు నిలిపేసి కాంట్రాక్టర్లను తరిమేసింది. దాంతో ఆయా సంస్థలు ఏర్పాటు చేసుకున్న యంత్రాలు, కర్మాగారాలు శిథిలమైపోయాయి. మరోవైపు నిర్మాణం జరిగిన రోడ్లను ఎక్కడికక్కడ వైసీపీ దొంగలు తవ్వేసి తీసుకెళ్లారు. పైపులైన్లు, గ్రావెల్, మెటల్ వంటివి వేటినీ వదిలి పెట్టలేదు. ఇప్పుడు అవన్నీ పునరుద్ధరించి రోడ్డు నెట్‌వర్కు పనులను ప్రారంభించి పూర్తి చేయడమే ఏపీసీఆర్‌డీఏ, ఏడీసీలకు సవాలుగా మారింది. ఈ నెట్‌వర్కుని పూర్తి చేయగలిగితే శరవేగంగా లేఅవుట్లలో నిర్మాణాలు ఊపందుకుంటాయి. దాని వల్ల భవన నిర్మాణ ప్లాన్‌లు, నిర్మాణ సామగ్రి కొనుగోలుకు సంబంధించి జీఎస్‌టీ, ఇతర పన్నుల రూపంలో అమరావతి రాజధానికి భారీగా ఆదాయం సమకూరుతుంది. సీడ్‌యాక్సెస్ రోడ్లు పూర్తి చేస్తే పెట్టుబడుల కోసం ఎదురు చూడాల్సిన పని ఉండదు. రెసిడెన్షియల్, కమర్షియల్ పరంగా ఎల్లెడలా విస్తరించుకుంటూ అమరావతి అజరామరంగా వెలిగిపోయే అవకాశం ఉంటుంది.



- పాతుకుపోయి నిత్యం కాసులవేట
- హాస్టల్ మెనూ నుంచి అన్నింటా వసూళ్లు
- ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల డిమాండ్

సంక్షేమంలో.. వసూల్ రాజాలు

గుంటూరు(విద్య), జూలై 9: పేద, బడుగు , బలహీనవర్గాల విద్యార్థుల సంక్షేమమే ఆశాఖ ధ్యేయం. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్న వారి బాగోగులే ఆశాఖ అధికారుల లక్ష్యం. కానీ అసలు విషయం మరిచి వసూళ్ల వేటలో అధికారులు నిమగ్నమయ్యారు. శాఖపై ఎప్పటి కప్పుడు సమీక్షిస్తూ చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం పట్టించు కోలేదు. అక్రమార్కులు సంక్షేమశాఖలో వీరంగం చేస్తున్నా గత ప్రభుత్వ హయాంలో దాదాపు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫలితంగా ఇక్కడ సంత్సరాల తరబడి అధికారులు, సిబ్బంది పాతుకుని పోయి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిత్యం కాసులవేట సాగిస్తున్నారు. సంక్షేమ హాస్టళ్ల మెనూ నుంచి ఉద్యోగోన్నతులు, ఉద్యోగ విరమణ ప్రయోజనాల వరకు చేతివాటం చూపుతున్నారు. ఇన్‌చార్జిగా ఉంటూ ఓ అధికారి అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. సంక్షేమశాఖలో ఓ అధికారి దాదాపు ఐదేళ్ల నుంచి కొనసాగుతున్నారు. ఇటీవల ఆయన పర్యవేక్షించే శాఖలో 2021 నుంచి 2024 వరకు అనేక మంది ఉద్యోగ విరమణ చేశారు. వారి ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కోసం ఒక్కొక్కరి నుంచి రూ.1.20 లక్షలు వసూలు చేసినట్లు ప్రచారం ఉంది.

● గూపు-4 స్థాయి ఉద్యోగులకు గేడ్-2 నుంచి గ్రేడ్ -1 స్థాయిలో ఉద్యోగోన్నతులు ఇప్పించి ఒక్కొక్కరి దగ్గర రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలను సదరు అధికారి వసూలు చేశాడన్న ఆరోపణలున్నాయి. ఇందులో సీనియార్టీకి తిలోదకాలు ఇచ్చారని, తనకు అన్యాయం జరిగిందని ఇప్పటికే ఓ ఉద్యోగి రాష్ట్రస్థాయిలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. గత కలెక్టర్ సైతం చూసీ చూడనట్లు వ్యవహరించడంతో అ అధికారి అక్రమాలకు అంతు లేకుండా పోయిందని సమాచారం. సంక్షేమశాఖ హాస్టళ్లకు పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల విషయంలో జేసీ ఛైర్మన్‌గా ఉండి సరఫరాదారుల్ని ఎంపిక చేస్తారు. అయితే ఇక్కడ పాతుకుని పోయిన అధికారి ఇంత వరకు డీపీసీ(డిస్ట్రిక్ పర్చేజింగ్ కమిటీ) ద్వారా నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయలేదని ఫిర్యాదులు ఉన్నాయి. బిల్లులు ఆలస్యం అవుతున్నాయనే సాకుతో హాస్టల్ వార్డెన్లను బినామీలుగా ఉంచి సరుకులు సరఫరా చేశారు. ఇలా పంపిణీ చేసిన వస్తువులకు, బయటి మార్కెట్ వస్తువులకు భారీ వ్యత్యాసం ఉన్నా బిల్లులు మంజూరు చేసి దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇన్‌చార్జి అధికారి అక్రమాలపై కలెక్టర్, రాష్ట్ర మంత్రులకు ఇప్పటికే విద్యార్థి సంఘాలు ఫిర్యాదులు పంపాయి. ఏసీబీ కూడా సదరు అధికారి అక్రమాలపై దృష్టి పెట్టినట్లు సంఘాల నాయకులు చెబుతున్నారు.

● బీసీ సంక్షేమశాఖలో ఇద్దరు ఉద్యోగులు అన్ని తామై వ్యవహరిస్తున్నారు. దాదాపు 18 ఏళ్ల నుంచి ఇక్కడే వారు కొనసాగుతున్నారు. ఏ పనికావాలన్నా ఈ ఇద్దరు ఉద్యోగులే కీలకంగా వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ఓ ఉద్యోగి కారుణ్య నియామకం కింద వచ్చి దాదాపు 16 ఏళ్లుగా కీలక సీట్లో ఉంటూ అందినకాడికి దండకుంటున్నాడనే ఫిర్యాదులు ఉన్నాయి.



విన్నపాల వెల్లువ

- 14వ రోజూ లోకేశ్ ప్రజాదర్బార్
- నూతన ఒరవడి సృష్టిస్తున్న ఐటీ శాఖ మంత్రి
- యువనేత ఆత్మీయ పలకరింపు..

6లో..

సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమేరాలు తప్పనిసరి

- రేంజి డీఐజీ త్రిపాఠి

సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమేరాలు తప్పనిసరి

● గుంటూరు రేంజి డీఐజీ త్రిపాఠి



సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న రేంజ్ డీఐజీ త్రిపాఠి

తాడేపల్లి టౌన్, జూలై 9: సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమేరాలు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని గుంటూరు రేంజి డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న తాడేపల్లి పరిధిలో పలు ప్రాంతాలను డీఎస్పీ రవికాంత్, సీఐ కళ్యాణ్‌రాజు సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. కృష్ణానది తీరం వెంబడి ఉన్న సీతానగరం, ప్రకాశం బ్యారేజి, మహానాడు తదితర ప్రాంతాల్లో ఎక్కడ ఎక్కడెక్కడ సీసీ కెమేరాలు ఉన్నాయో వాటి పనితీరు అడిగి తెలుసుకున్నారు. అలాగే మరికొన్నిచోట్ల నూతనంగా సీసీ కెమేరాలు స్థానికుల సమన్వయంతో ఏర్పాటుచేయాలని సూచించారు. సీఎం, మంత్రులు సహా వీవీఐపీలు తిరిగే మార్గాలుకావడంతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో అలసత్వం వహించరాదని ఆదేశించారు. చట్టవ్యతిరేకకార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించడం తగదని హెచ్చరించారు. కఠినచర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఒకరికి గాయాలు



సుబ్బారావు మృతదేహం

తుళ్లూరు, జూలై 9: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం లింగాయపాలెం పరిధిలోని సీడ్‌యాక్సెస్ రోడ్డులో జరిగింది. జంక్షన్ దాటిన తరువాత కుక్క అడ్డురావటంతో ఇద్దరు ప్రయాణిస్తున్న బైకు అదుపుతప్పింది. వెనకకూర్చొని ఉన్న నర్సపురం వెంకటసుబ్బారావు(27) వెనకకుపడిపోయి తల డివైడర్‌కు బలంగా తగిలింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంగళగిరి హాస్పటల్‌కు తరలించారు. బైకు నడుపుతున్న ధనసిరి మురళికి చిన్న గాయమైంది. చికిత్సకోసం హాస్పటల్‌కు తరలించారు. మృతుడు వెంకటసుబ్బారావు తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామవాసి. అతనికి భార్య, నాలుగు సంవత్సరాల కూమార్తె ఉన్నారు. గాయపడ్డ మురళి, మృతిచెందిన వెంకటసుబ్బారావు కరెంటు పనిచేస్తూ ఉంటారని బంధువులు తెలిపారు. రోజూ విజయవాడ పరిసర ప్రాంతాలకు వెళ్ళి పనులుచేసుకుని సాయంత్రం ఇంటికి వస్తుంటారని తెలిపారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం ఇరువురు నెక్కల్లు నుంచి బైకుపై బయలుదేరి ఈ దుర్ఘటనకు గురయ్యారని తెలిపారు. తుళ్లూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విన్నపాల వెల్లువ

● 14వ రోజూ లోకేశ్ ప్రజాదర్బార్
● నూతన ఒరవడి సృష్టిస్తున్న ఐటీ శాఖ మంత్రి
● యువనేత ఆత్మీయ పలకరింపు.. అర్జీదారుల్లో ఆనందం



అర్జీలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

తాడేపల్లి, జూలై 9: వివిధ ప్రాంతాల నుంచి సమస్యల వినుతులతో బాధితులు తరలివస్తూనే ఉన్నారు.. ఆత్మీయ పలకరింపుతో వారి నుంచి అర్జీలు స్వీకరిస్తూ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇస్తూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నూతన ఒరవడి సృష్టిస్తున్నారు. లోకేశ్ ఉండవల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ మంగళవారంతో 14వ రోజుకు చేరుకుంది. మంగళగిరితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు యువనేతను నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవిస్తున్నారు. విజ్ఞప్తులు స్వీకరిస్తూ పెద్దలను నమస్కారం తాతయ్య.. నమస్కారం అమ్మా అంటూ పిలుస్తున్న లోకేశ్ ఆత్మీయ పలకరింపునకు ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయనే భరోసా, నమ్మకంతో అర్జీలు అందించి లోకేశ్‌ను ఆశీర్వదిస్తూ వెళుతున్నారు. గత ప్రభుత్వంలో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని బారికేడ్లతో నిలువరించి అనేక ఇబ్బందులకు గురి చేశారు. కానీ నేడు ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరని నేరుగా కలిసి విజ్ఞప్తులు స్వీకరించడంతోపాటు ఆయా సమస్యల పరిష్కారానికి లోకేశ్ సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలి


రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో పనిచేస్తున్న కొంతమంది ఆయాలు, పారిశుధ్య కార్మికులను గత ప్రభుత్వం అర్ధాంతరంగా తొలగించిందని, ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని విజయవాడకు చెందిన ఏపీజీసీఏఎస్ యూనియన్ ప్రతినిధులు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తొమ్మిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని పాఠశాలల విలీనంతో పని ఒత్తిడి పెరిగిందని తెలిపారు. కనీస వేతనం అమలు చేయడంతోపాటు అకారణంగా విధుల నుంచి తొలగించిన వారిని విధుల్లో తీసుకోవాలని పారిశుధ్య కార్మికులు కోరారు.

బాధితులు బారులు

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తాడేపల్లి కృష్ణా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీతం బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కేసీ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు లోకేశ్‌ను కోరారు. పక్షవాతంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని మెల్లెంపూడికి చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన సతీమణి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం చేయాలని మంగళగిరి ఉడా కాలనికి చెందిన షేక్ మౌలాలి కోరారు. తమ ప్రాంతంలో తాగునీటి సరఫరాతోపాటు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆత్మకూరులోని సీతారామ అపార్టుమెంట్ వాసులు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన అక్రమాలపై న్యాయవిచారణ జరిపించి తక్షణమే వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలని విశాఖకు చెందిన ఏపీబీసీ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా నాగులాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తున్న తనను గత ప్రభుత్వం అకారణంగా తొలగించిందని తిరిగి ఉద్యోగం కల్పించాలని ఎన్ మహేశ్వరి కోరారు. శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న తనకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని డీసీ ఉన్నూరు సాహెబ్ కోరారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణతోపాటు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పరీక్ష నిర్వహించాలని అర్హత పత్రాలు మంజూరు చేయాలని, ఆర్ఎంపీ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ ప్రతినిధులు కోరారు.

వైసీపీ నేతల భూ అక్రమాలపై సిట్ ఏర్పాటుచేయాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, జూలై 9: వైసీపీ నేతల భూ అక్రమాల పై రాష్ట్రస్థాయిలో ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటుచేస్తే మేలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. మంగళవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు నుంచి ఉత్తరాంధ్ర వరకు వైసీపీ గద్దలు చెరబట్టిన భూములను విడిపించాలన్నా, సత్వర న్యాయం జరగాలన్నా ఇదే మేలన్నారు. మరీ ముఖ్యంగా నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నుంచి అతని కోటరి విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలే కాక నాటి సీఎస్ జవహర్‌రెడ్డి పైనా తీవ్రమైన ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్‌కు అప్పగించటమే ఉత్తమమన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో ఒక్క విశాఖ ఉత్తరాంధ్రలోనే 40వేల ఎకరాలకు పైగా భూ ఆక్రమణలు జరిగినట్టు ఫిర్యాదులు ఉన్నాయని, అవన్నీ ప్రత్యక్షంగా, పరోక్షంగా వైసీపీ నేతలతోనే ముడిపడి ఉన్నాయన్నారు. మరీ ముఖ్యంగా పేదలకు ఏదో మేలు చేస్తున్నట్టు నటించి అసైన్డ్ భూముల శాశ్వతహక్కుల పేరుతో వారి జీవనాధారంగా ఉన్న పొలాలు లాక్కున్న దుర్మార్గపు పాలన నాడు రాష్ట్రమంతా చూసిందన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో విడుదల చేయనున్న శ్వేతపత్రంలో ఈ భూదోపిడీ మొత్తాన్ని ప్రజల ముందుకు తీసుకువస్తామన్నారు. అదేవిధంగా భూముల రీసర్వే చట్టంలో లొసుగులతో ఎన్ని భూములు కొట్టేశారో కూడా నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. నాటి ప్రభుత్వంలో ఉన్న పెద్దలే బినామీలను అడ్డం పెట్టుకొని విలువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూములు కాజేశారని, తమ అనుయాయులకు, తమకు కావాల్సిన కంపెనీలకు నాటి సీఎం జగన్ అడ్డదారుల్లో వేలాది ఎకరాలు కట్టబెట్టేసిన తీరుపై నిజాలు వెల్లడి కావాలని ప్రత్తిపాటి కోరారు. ఇవేకాక జగనన్న కాలనీల పేరిట పేదల ఇళ్ళస్థలాల పథకంలో భారీగా దోచేశారని, భూములు చేతులు మారాయన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎవ్వరూ చేయని రీతిలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని, వైసీపీ ఐదేళ్ల భూఆక్రమాలపై కఠినచర్యలతో పాటు ఈ ఆస్తుల మొత్తాన్ని రికవరీ చేయాలని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

మన్నవలో రికార్డుల తారుమారుపై విచారణ

● నెల రోజులుగా సర్పంచ్ కనిపించటం లేదంటూ ఫిర్యాదు ● రికార్డుల అదృశ్యంపై ఆగ్రహం



మన్నవ పంచాయతీ కార్యాలయంలో విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో స్వరూపరాణి

పొన్నూరుటౌన్, జూలై 9: పొన్నూరు మండలం మన్నవ గ్రామంలో రికార్డుల తారుమారు, సర్పంచ్ అందుబాటులో లేకపోవటంపై మంగళవారం డీఎల్‌పీవో స్వరూపరాణి విచారణ నిర్వహించారు. ఇటీవల గ్రామస్తులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు నెల నుంచి గ్రామంలో అందుబాటులో లేరని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంచి నీరు అందక శానిటేషన్ సక్రమంగా చేయకపోవటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన సచివాలయంలో గ్రామసభ నిర్వహించినా సర్పంచ్ ఆ రోజు కూడా అందుబాటులో లేరని చెప్పారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ కూడా గ్రామసభకు అందుబాటులో లేకుండా వెళ్లిపోయారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలలో ఉండాల్సిన రికార్డులు, అకౌంట్ పుస్తకాలు, సమావేశ తీర్మానాలు, గ్రామసభ పుస్తకాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలు, చెక్ బుక్కుల వంటి రికార్డులను గ్రామ కార్యదర్శి ఆధీనంలో ఉండాల్సివుండగా సర్పంచ్ నాగమల్లేశ్వరరావు రికార్డులు తీసుకువెళ్లారని పంచాయతీ అధికారులు చెబుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రికార్డులన్నీ బిల్ కలెక్టర్ వాకా శ్రీనివాసరావు సర్పంచ్‌కు అందచేశారని ఆరోపించారు. పంచాయతీ నిధులు అన్నింటిని దొంగ బిల్లులతో దారి మళ్లించి అవినీతికి పాల్పడుతున్నారని తాము ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు. వీటన్నింటిపై మంగళవారం డీఎల్‌పీవో పంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. కార్యదర్శి రవిబాబు అనారోగ్యంతో బాధపడుతుంటంతో బిల్ కలెక్టర్ వద్ద రికార్డులు అన్నీ భద్రపరిచినట్లు సమాధానం ఇవ్వటంతో బిల్ కలెక్టర్‌ను ప్రశ్నించారు. బిల్‌కలెక్టర్ శ్రీనివాసరావు పొంతన లేని సమాధానాలు ఇవ్వటంతో డీఎల్‌పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మూడు రోజుల లోగా రికార్డులు అందచేయాలని ఆదేశించారు. విచారణ జరుగుతుండగానే ఓ వ్యక్తి కొన్ని రికార్డులను సర్పంచ్ నాగమల్లేశ్వరరావు పంపాడని కార్యాలయంలోకి తీసుకురాగా డీఎల్‌పీవో వీడియో రికార్డింగ్ చేయించారు. పంచాయతీలో ఉండాల్సిన రికార్డులు బయటకు తరలించటంపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. అలాగే నెలరోజులకు పైగా సర్పంచ్ గ్రామ ప్రజలకు అందుబాటులో లేకుండాపోవటంపై కూడా నివేదిక రూపొందించనున్నట్లు చెప్పారు.

లింగాయపాలెం-తాళ్లాయపాలెం
ఇసుక స్టాక్‌యార్డును పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



స్టాక్‌యార్డు వద్ద తహసీల్దార్ సుధీర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మీ పక్కన ఎస్పీ తూషార్ రూఢీ

తుళ్లూరు, జూలై 9: మండలంలోని లింగయపాలెం, తాళ్ళయపాలెంలో ఇసుక స్టాక్‌యార్డులలో లోడింగ్ పనులను కలెక్టర్ నాగలక్ష్మీ, ఎస్పీ తుషార్‌రూఢీ మంగళవారం పరిశీలించారు. ఇసుక లోడింగ్ విషయంలో యంత్రాలతోపాటు, ట్రాక్టర్‌లకు లోడు చేసేందుకు కూలీలకు పనికల్పించాలని గ్రామస్తులు వారికి విన్నవించారు. రాజధానికి భూములివ్వటంతో ఉపాధిలేక కూలీలు అల్లాడుతున్నారని విన్నవించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇసుకపాలసీ తెచ్చి లోడింగ్ పనులు మొదలయ్యాయని, రెండుమూడు నెలల్లో కొత్త పాలసీ వస్తుందని, తప్పకుండా వారికి అవకాశం ఉండేలా ప్రభుత్వానికి చెపుతామని కలెక్టర్ హామీనిచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడారు. రెండు స్టాక్‌యార్డుల్లో దాదాపు 6లక్షల టన్నుల ఇసుక నిల్వవున్నట్టు చెప్పారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో కమిటీ ఇసుక లోడింగ్ పనులు పారదర్శకంగా నిర్వర్తిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఏవో శ్రీఖర్, పోలీసు, రెవెన్యూ తదితర అధికారులు పాల్గొన్నారు.

12న పెన్షన్ అదాలత్

గుంటూరు(విద్య), జూలై 9: ఈనెల 12న భవిష్యనిధి పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెన్షన్ అదాలత్ నిర్వహి స్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్‌దారులు తమ సమస్యలను ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి పెన్షన్ కార్యాలయంలో సమర్పించవచ్చని తెలిపారు. సమస్యలను ro.guntur@ epfindia.gov.in మెయిల్‌కు లేదా 949 46557469 అనే వాట్సప్‌నంబర్‌కు, వెబ్ఎక్స్ ఐడీ 26441709396, పాస్‌వర్డ్ epfo@1234 ద్వారా తెలపాలని సూచించారు.

సూర్యలంక తీరంలో దుకాణాల మూత

● కొనసాగుతున్న పర్యాటకుల నిషేధం ● నిర్మానుష్యంగా సముద్రతీరం ● చిరువ్యాపారులపై తీవ్ర ప్రభావం



పర్యాటకుల రాకపోకలను నిషేధించటంతో నిర్మానుష్యంగా ఉన్న సూర్యలంక సముద్రతీరం



సూర్యలంక సముద్రతీరంలో మూతపడిన దుకాణాలు

బాపట్ల, జూలై 9: నిత్యం పర్యాటకులు, భక్తుల రాకపోకలతో రద్దీగా ఉండే సూర్యలంక సముద్రతీరం గత నెల 24వ తేదీ నుంచి వెలవెలబోతున్నది. తీరంలో వరుస ప్రమాదాల దృష్ట్యా పోలీసు అధికారులు తీరానికి పర్యాటకుల అనుమతిని నిలిపివేశారు. జిల్లాలోని వేటపాలెం మండలం రామాపురం బీచ్‌లో వరుసగా పర్యాటకులు గల్లంతై మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు సముద్రతీరానికి పర్యాటకులను రావద్దని ప్రకటించారు. దీంతో అప్పటినుంచి తీరంలో జనసంచారం లేదు. పోలీసులు, మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తూ పర్యాటకులను రాకుండా అడ్డుకుంటున్నారు. దీనివల్ల ఈ ప్రాంతంలో చిరువ్యాపారాలు చేసుకొని జీవనం సాగించే కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. తీరంలో దుకాణాలు ఏర్పాటుచేసుకొని పర్యాటకుల నుంచి వచ్చే ఆదాయంతో జీవనం సాగించే కుటుంబాలు ఆదాయం లేక అల్లాడిపోతున్నారు. సూర్యలంక సముద్రతీరంలో 39 దుకాణాలు ఉన్నాయి. వీటిల్లో పర్యాటకులు, భక్తులకు అవసరమైన వివిధ రకాల వ్యాపారాలు జరుగుతుంటాయి. అదేవిధంగా ఫిష్ ఆంధ్ర దుకాణాలు 10, ఐస్‌క్రీమ్ బండ్లు 50, చేపలు విక్రయదుకాణాలు 10, బోర్డింగ్‌పాయింట్‌లు 5, రైడింగ్ బైక్‌లు, గుర్రం స్వారీ, ఒంటెలు ఏర్పాటుచేసుకొని జీవనం సాగించే కుటుంబాలు ఉన్నాయి. తీరానికి వచ్చే పర్యాటకులే తమకు జీవనాధారమని వారు పేర్కొంటున్నారు. అయితే సముద్ర ఆటుపోటుల వల్ల ఏర్పడిన గుంతలతో ప్రమాదం పొంచివుందనే భయంతో అధికారులు తీరానికి పర్యాటకులను అనుమతించడంలేదు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల నుంచి తెలియక వచ్చే పర్యాటకులు వెనక్కి వెళ్ళిపోతున్నారు. దీనివల్ల దుకాణాలు మొత్తం మూతపడి సూర్యలంక తీరం నిర్మానుష్యంగా మారింది. ఇంకా 10 రోజులపాటు తీరానికి అనుమతిలేదని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో చిరువ్యాపారులు, రోజువారి కూలీలు అల్లాడిపోతున్నారు. పోలీసులు మాత్రం పర్యాటకుల శ్రేయస్సే లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటిస్తున్నారు. ఈ విషయమై డీఎస్పీ కృష్ణను వివరణ కోరగా పర్యాటకులకు అనుమతి ఇచ్చే విషయమై ఎస్పీ వకుల్‌జిందాల్‌తో మాట్లాడి ప్రకటిస్తామని చెప్పారు.

సి.హెచ్.మురళీ

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

రూ.55.6 లక్షల విలువైన బయోల అమ్మకాలు నిలిపివేత



పురుగుమందుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

గుంటూరు సిటీ, జూలై 9: రాష్ట్రస్థాయి తనిఖీ బృందాలు జిల్లా లోని వ్యవసాయ ఆధారిత కంపెనీలు, షాపులపై మంగళవారం దాడులు నిర్వహించాయి. గుంటూరు అర్బన్, ప్రత్తిపాడు, తెనాలి, మేడికొండూరు, మంగళగిరి మండలాల్లో తనిఖీలు కొనసాగినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ తనిఖీలలో స్టాక్ రిజిస్టర్లు పరిశీలించటంతో పాటు, నిల్వలను అధికారులు పరిశీలించారని తెలిపారు. నిబంధనలు సక్రమంగా పాటించని రూ.55.6 లక్షల విలువైన బయో ఉత్పత్తులు, ఎరువుల అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ దాడులు ఇంకా కొనసాగుతాయని వెల్లడించారు. ఈ దాడుల్లో ఏడీఏలు కే నాగేశ్వరరావు, బాలాజీనాయక్, విజిలెన్స్ సీఐలు ఎస్ శ్రీనివాసరెడ్డి, సీ మాణిక్యరావు, వ్యవసాయ అధికారి బీ గౌతమ్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

33,152 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 34,722 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 33,152 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 15,887 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	8500	15500
నెంబరు. 5	8000	15000	నెంబరు.5	–	–
273	11000	15000	273	13500	13500
341	8500	16000	341	12500	13300
4884	–	–	4884	13000	15500
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	19000	తేజ	10000	18500
బ్యాడిగి	8500	16500	బ్యాడిగి	11000	14000
దేవనూరుడీలక్స్	9000	15500	దేవనూరుడీలక్స్	10000	15500
తెల్లకాయలు	5000	12500	తెల్లకాయలు	6000	11500

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి



ఉప్పుతోళ్ల తిరుపతయ్య మృతదేహం

దాచేపల్లి, జూలై 9: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికూడి సమీపంలో వైసీపీ నేత నిర్వహిస్తున్న మైనింగ్ క్వారీలో పడి యువకుడు మంగళవారం మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి మృతుని బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి. మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల తిరుపతయ్య (20) కొంతకాలంగా చెడు అలవాట్లకు బానిసయ్యాడు. దీంతో పలుమార్లు తండ్రి మందలించడం జరిగింది. గతంలో ఒకటి రెండుసార్లు మృతుడు తిరుపతయ్య ఆత్మహత్యకు యత్నించినట్లు కూడా తెలుస్తుంది. తన మొబైల్ ఫోన్ క్వారీ గుంత ఒడ్డున పెట్టి గుంతలో దూకి మృతి చెందినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎర్రబాలెం శ్రీనగర్ కాలనీలో చోరీ

● 136 గ్రాముల బంగారం, అరకిలో వెండి అపహరణ

మంగళగిరి సిటీ, జూలై 9: మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో చోరీ జరిగింది. పెద్ద మొత్తంలో బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎర్రబాలెం శ్రీనగర్ కాలనీకి చెందిన లంకె సురేష్ హార్టికల్చర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. బంధువు చనిపోవడంతో కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 6వ తేదీన అనంతపురం వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగులగొట్టబడి వున్నాయి. చోరీ జరిగిందని గ్రహించి మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో సుమారు 136 గ్రాముల బంగారు ఆభరణాలు, అరకిలో వెండి వస్తువులు, రూ.30వేల నగదు అపహరణకు గురైనట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సురేష్ ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


నీటి కుళాయిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గంజాయి మత్తును వదిలించండి

● పోలీస్ అధికారులకు ఎమ్మెల్యే గల్లా మాధవి ఆదేశం

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గంజాయి మత్తును వదిలించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి పోలీస్ అధికారులను ఆదేశించారు. నల్లచెరువు 19వ డివిజన్లో మంగళవారం ఉదయం ఆమె పలు వీధుల్లో పర్యటించారు. అనేక మంది మహిళలు తమ డివిజన్‌లో వీధి దీపాలు, డ్రెయిన్ల సమస్యలను ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకొనిరాగా, ఈ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొంతమంది మహిళలు తమ పిల్లలు గంజాయికి బానిసలు అయ్యారని, శానిటైజర్ వంటి విషపదార్థాలను తీసుకుంటున్నారని వాటిని అరికట్టాలని ఎమ్మెల్యే ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు. పోలీసు అధికారులు వెంటనే దీని మీద దృష్టి సారించాలని ఎమ్మెల్యే మాధవి కోరారు. నల్లచెరువు వాకింగ్ ట్రాక్ లో వీధిలైట్లు ఏర్పాటు చేసి, పోకిరిల ఆగడాలను కట్టడి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శిరిపురపు శ్రీధర్, రాళ్లబండి రామరాజు, తెలుకుట్ల హనుమాయమ్మ, రహీం, చంద్రగిరి బాబు, యోగేశ్వరరావు, పులి కృష్ణ, బత్తుల రమణమ్మ, పరిమి రమేష్, ఉమర్ వలి, విజయలక్ష్మి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో వలస పోయిన నిర్మాణ కార్మికులు

వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఇసుక దోపిడీ విధానం కారణంగా రాష్ట్రంలోని నిర్మాణరంగ కార్మికులు పక్క రాష్ట్రాలకు వలస వెళ్లారని, ఇక నుంచి ఆ పరిస్థితి ఉండదని ఎమ్మెల్యే మాధవి భరోసా ఇచ్చారు. ఉచిత ఇసుక పాలసీని తెచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతగా పశ్చిమ కార్యాలయంలో నిర్మాణ కార్మికులతో కలిసి ఆమె చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మేయర్ మనోహర్‌నాయుడు రాజీనామా చేయాలి

మేయర్ కావటి మనోహర్ నాయుడికి ఏమాత్రం చిత్తశుద్ధి వున్నా వైసీపీకి, మేయర్ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యే గల్లా మాధవి డిమాండ్ చేశారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై వల్లభనేని వంశీ చేసిన వ్యాఖ్యలపై నేడు ఆయన మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. వంశీ వ్యాఖ్యలను మనోహర్‌నాయుడు మనస్ఫూర్తిగా తప్పు పడితే వెంటనే వైసీపీకి, తన మేయర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు

పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అధికారులను హెచ్చరించారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె నగరపాలక సంస్థ పారిశుధ్య అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తన దృష్టికి పారిశుధ్య సమస్యలే ఎక్కువగా వస్తున్నాయని, వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, విద్యుత్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంహెచ్‌వో, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, విద్యుత్ శాఖ ఏడీ, ఎస్టేటు ఆఫీసర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగం కార్మికుల కళ్లల్లో ఆనందం చూస్తున్నాం

● తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తెచ్చిన ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ కార్మికుల్లో ఆనందం వెల్లివెల్లివిరిసిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశ పెట్టిన సందర్భంగా ఆయన పట్నంబజార్‌లో నిర్మాణ కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి కార్మికులకు కండువాలు కప్పి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం ఆదాయాన్ని వదులుకుని ఉచిత ఇసుక విధానాన్ని చంద్రబాబు అమలు చేశారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెల రోజుల్లోనే అమల్లో తెచ్చి మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో లక్షల టన్నులు ఇసుకను జగన్మోహన్ రెడ్డి బినామీ సంస్థలు మింగేసారన్నారు. ప్రజలకు ఇసుక కొనుగోలు భారం కాకూడదనే తమ ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, డిప్యూటీ మేయర్ సజీలా, చిన్నీ, గౌస్, సలీం, చిన్న బుజ్జి, కరీముల్లా, జనసేన నేత దుర్గాప్రసాద్, సురే శీను, ఖాసిం,తదితరులు పాల్గొన్నారు.


భవన నిర్మాణ కార్మికులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

డివిజన్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

గుంటూరు తూరు నియోజకవర్గంలోని 12వ డివిజన్లో సమస్యలన్నింటినీ పరిష్కరించి మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని నసీర్ అన్నారు. డివిజన్లో మంగళవారం ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గుంతలను పూడ్చాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులు పెన్షన్లు అర్హులైన వారందరికీ అందించాలనీ సచివా లయ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందించే రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

జీజీహెచ్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించండి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలు అవసరమని ఎమ్మెల్యే నసీర్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌ను కోరారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఆయనను నసీర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వెయ్యి పుస్తకాల పంపిణీ

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపు మేరకు పలువురు టీడీపీ నేతలు మంగళవారం ఆయన చేతుల మీదుగా వెయ్యి పుస్తకాలు పంపిణీ చేశారు. కోట శేషగిరి, చిట్టాబత్తిన చిట్టిబాబు, గుడివాడ రవీంద్రకుమార్, గుండా హరి, మాజేటి కిశోర్, వీ. నాగేశ్వరరావు, శ్రీనివాస్, బుస నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలి

● ఎన్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి హైమారావు

గుంటూరు(విద్య), జూలై 9 : నగరపాలక సంస్థ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర కార్యదర్శి బి.హైమారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి ఆయన మంగళవారం డీఈవో పి.శైలజకు వినతిపత్రం అందజేశారు. నగరంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తిని పరిశీలించి మిగిలిన ఉపాధ్యాయుల్ని ఉన్నత పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై నియమించాలని కోరారు. అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలకు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని, సీనియార్టీ జాబితాలో లోపాలు సవరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె అబ్దుల్‌ఖలీల్, ఎస్‌వి జగదీష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి ఆంతోనీబాబు, వీరబాబు, పి.రమేష్, హరగోపాల్, లలితబాబు తదితరులు పాల్గొన్నారు.


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యం నిరంతరం పర్యవేక్షించాలి

● స్త్రీ,శిశు సంక్షేమ శాఖకు కలెక్టర్ ఆదేశం

గుంటూరు సిటీ, జూలై 9 : జిల్లాలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం సక్రమంగా అందించటంతో పాటు వారి ఆరోగ్యంను ఆషా, ఎఎన్ఎం, మహిళా పోలీస్‌లను సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల గ్రోత్ లెవల్స్, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితి, పౌష్టికాహారం, బాలా అమృతం, వాటి సరఫరా, అమలు చేస్తున్న కార్యక్రమాలు, మౌలిక సౌకర్యాలు, గృహహింస, లైంగిక వేధింపులు, బాధితులకు పరిహారం, మిషన్ వాత్సల్య కార్యకలాపాలు, పునరావాస కేంద్రాలు తదితర అంశాలపై జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ ఎత్తుకు తగిన బరువు, నిర్దేశించిన ఎదుగుదల లేని చిన్నారులపై అంగన్ వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోని ప్రతి రోజు వారు పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సరుకులు నిర్దేశిత సమయానికి పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవటంతో పాటు సరఫరా సమయంలోనే సరుకుల నాణ్యతను పరీక్షించి తీసుకునేలా క్షేత్ర స్థాయి సిబ్బంది సూపర్‌వైజర్ల ద్వారా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పై వైద్యారోగ్యశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ మెరుగైన వైద్యసలహాలు,సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, చిన్నారులపై లైంగిక దాడులు నివారించేందుకు విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ఎం.ఉమాదేవి, నోడల్ అధికారి శ్రీవాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ విజయ కుమార్, సీడీపీఓలు పాల్గొన్నారు.


స్త్రీ,శిశు సంక్షేమ శాఖ పై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి


సిమెంట్ బెంచీలుప్రారంభిస్తున్న నసీర్ అహ్మద్, కిరణ్‌కుమార్

ప్రభుత్వాస్పత్రిలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు

● అందజేసిన రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు

గుంటూరు (మెడికల్) జూలై 9: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి అభివృద్ధికి రోటరీ క్లబ్ అందిస్తున్న చేయూత ప్రశంసనీయమని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రి పాత ఓపీ బ్లాక్ దగ్గర రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.లక్ష విలువైన సిమెంట్ బల్లలను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఆసుపత్రిలో శరవేగంగా నిర్మాణం జరుపుకుంటున్న ఎంసీహెచ్ బ్లాక్‌కు తమ వంతుగా రోటరీ క్లబ్ విరాళం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే నసీర్ కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అధ్యక్షుడు గాలి సుబ్బారావు, కార్యదర్శి పీవీ సత్యనారాయణ, చదలవాడ రఘు, ఎల్.చంద్రశేఖరన్, కేవీ భాస్కరరావు, జగదీష్, టీడీపీ కార్పొరేటర్ పోతురాజు సమత, ఎంత శ్రీనివాసరావు, బ్రహ్మం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఇదేరీతిలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు కే.రజనీ ఆధ్వర్యంలో రూ.25 వేల విలువ గల 60 కుర్చీలను విరాళంగా జీజీహెచ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు కే.శైలజరాణి, ఎం.రాధ, పోలిశెట్టి యామిని, చక్కా శాంతి, శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయం కమిటీ చైర్మన్ ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ లీలలు ప్రవచనం


కైలాసనాథ్

గుంటూరు(తూర్పు), జూలై 9: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటే శ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్న మయ్య కళ్యాణవేదికపై మంగళ వారం బ్రహ్మశ్రీ మల్లాది కైలాసనాథ్ చే శ్రీ వ ు ద్భా గ వ త వ ు దశమస్కంధం శ్రీకృష్ణలీలలుపై ఆధ్యాత్మిక ప్రవచనా లు ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తాన య్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మల్లాది కైలాసనాథ్ ప్రవచిస్తూ యమునా నదిని విషపూరితం గావించిన కాళీయుడిని శిక్షించి, నదిని ప్రజోపయోగంగా మార్చినవారు శ్రీకృష్ణుడన్నారు. కాళీయుడు అంటే సర్పము రూపములో ఉన్న రాక్షసుడు మాత్రమే కాదు నేడు నదులను, అడవులను, ప్రకృతి సంపదను అనేక రకాలుగా కలుషితం, విషమయం చేస్తున్న వారందరూ కాళీయులేనన్నారు. ఇలా ప్రకృతి సంపదను పాడు చేస్తున్న వారు పరమాత్మ చేతిలో శిక్షింపబడతారని శ్రీకృష్ణలీలలో మనకు తెలుస్తుందని భగవత్ భక్తులకు సవివరంగా తెలియజేశారు.

చిప్స్ అధ్యాపకులకు ఐపీసీలో అత్యుత్తమ అవార్డులు

గుంటూరు(విద్య), జూలై 9 : ఇండియన్ ఫార్మస్యూటికల్ కాంగ్రెస్ 73 లో పాల్గొన్న చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ కళాశాల అధ్యాపకులకు అవార్డులు వచ్చినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాదులో అధ్యాపకులు సమర్పించిన పరిశోధనా పత్రాలకు వివిధ విభాగాలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు వచ్చినట్లు తెలిపారు. ఫార్మకాలజీ విభాగంలో ఆర్.సాయి రేష్మ పరిశోధనా పత్రానికి ప్రథమ బహుమతి, ఫార్మకాగ్నసీ విభాగంలో డాక్టర్ పి. విజేతకి ద్వితీయ బహుమతి వచ్చినట్లు తెలిపారు. అధ్యాపకుల్ని కళాశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, గోపాలకృష్ణ అభినందించారు.


అధ్యాపకుల్ని అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర

హెల్మెట్ ధారణ ఆవశ్యకత తెలుపుతూ నేడు ర్యాలీ

గుంటూరు(లీగల్), జూలై 9 : హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, శిక్షార్హమని తెలుపుతూ బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు జిల్లా కోర్టు వద్ద నుంచి ప్రారభంకానున్న ఈ ర్యాలీలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బిజి పార్థసారధి, సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ గుంటూరు, న్యాయమూర్తులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, అన్ని స్టేక్ హోల్డర్స్ డిపార్టుమెంట్స్ వారు, ప్యానెల్ లాయర్స్ , పారా లీగల్ వలంటీర్లు, ట్రాఫిక్ పోలీస్‌లు పాల్గొననున్నారు. 'హెల్మెట్ ను ధరించండి మీ ప్రాణాలను కాపాడుకోండి' అనే నినాదంతో హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, శిక్షార్హమని ప్రజలకు తెలియజెప్పేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు.

ఉచిత ఇసుక విధానంపై ప్రజల్లో హర్షం

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్

గుంటూరు, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రారంభించిన ఉచిత ఇసుక విధానంపై రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ అన్నారు. రాష్ట్రంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సహజ వనరులపై హక్కులను ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా ఈ ఉచిత ఇసుక విధానాన్ని టీడీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్జీటీ ఎన్నోసార్లు ఆంక్షలు విధించినా వేటిని లెక్కచేయకుండా అక్రమ రీతిలో ఇసుకను కొల్లగొట్టారని మండిపడ్డారు. ఆ ధనాన్ని అంతా వైసీపీ నాయకులు తమ జేబుల్లో వేసుకున్నారన్నారు. గత ఐదేళ్ల సామాన్యుడికి ఇసుక దొరకని పరిస్థితి నెలకొందని అన్నారు. ఇసుక అవసరమున్నవారు ఆన్లైన్లో బుక్ చేసుకునే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఇసుక మీద ప్రభుత్వానికి ఎటువంటి రాబడి లేకుండా కేవలం నిర్వహణ చార్జీలు, సీనరేజీ చార్జీలకు మాత్రమే ఇసుక అందిస్తుందన్నారు. సీనరీ చార్జీలు సైతం గ్రామపంచాయతీలకు అప్పగించే ఏర్పాట్లు ప్రభుత్వం చేసిందన్నారు.

అరండల్‌పేట ఎస్‌ఐ అనుచితంగా ప్రవర్తించారంటూ ఆందోళన

● పోలీస్‌స్టేషన్లో దళిత నేత బైఠాయించి నిరసన

● సంఘీభావం ప్రకటించిన దళిత సంఘాలు

● చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ


అరండల్‌పేట స్టేషన్‌లో ఆందోళనకు దిగిన దళిత సంఘ నాయకులు

గుంటూరు, జూలై 9 : తన సెల్ ఫోన్ పోయిందంటూ పది రోజులు క్రితం ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు పురోగతి తెలుసు కునేందుకు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన దళిత నేతకు, పోలీసులకు మధ్య వివాదం జరిగింది. దళిత సంఘం నాయకుడు నల్లపు నీలాంబరం సెల్‌ఫోన్ పది రోజుల క్రితం చోరీకి గురైంది. దీనిపై ఆయన అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన బంధువైన యువకుడు ఫోన్ తీసి ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అయితే పోలీసులు సెల్‌ఫోన్ మిస్సింగ్‌కు సంబంధించి ఆన్‌లైన్ పోర్టల్ లో ఫిర్యాదు చేయించారు. అయితే ఆన్‌లైన్ ఫిర్యాదుకు సంబంధించి ఎటువంటి మెసేజ్ రాలేదు. దీంతో మంగళవారం తన సెల్‌ఫోన్ చోరీ విషయం గురించి తెలుసుకునేందుకు నీలాంబరం అరండల్‌పేట స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఎస్‌ఐ నాగరాజును కలిశారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఇద్దరి మధ్య మాటా మాట పెరగడంతో నీలాంబరంపై ఎస్‌ఐ నాగరాజు చేయి చేసుకున్నారు. ఎస్సై నాగరాజు తన పట్ల అనుచితంగా ప్రవర్తించారంటూ నీలంబరం పోలీస్ స్టేషన్‌లోనే బైఠాయించి నిరసనకు దిగారు. తన సెల్‌ఫోన్‌తో దళిత సంఘాలకు సమాచారం ఇవ్వడంతో ప్రజా సంఘాల నాయకులు అరండల్ పేట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. దళిత సంఘ నాయకుడు నీలాంబరం పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఎస్‌ఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

తనపై అనుచితంగా ప్రవర్తించిన ఎస్‌ఐ నాగరాజును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి విచారించాలని నీలాంబరం డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు మేడిద బాబురావు, భగత్ సింగ్, తెనాలి ప్రకాష్, జ్ఞానరాజు, తాడికొండ నరసింహారావు, జూపూడి శ్రీనివాసరావు, చిరతనగండ్ల వాసు, డేవిడ్ విలియమ్స్, చిలకా డేవిడ్, హనోకు బెంజిమన్, పాగళ్ల ప్రకాష్, సుధాకర్ తదితరులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. నీలాంబరంనకు మద్దతుగా వారు కూడా తమ నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న వెస్ట్ డీఎస్పీ మహేష్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి దళిత సంఘ నాయకులతో చర్చలు జరిపారు. ఎస్‌ఐ నాగరాజు పై చర్యలు తీసుకోవాలంటూ దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిరిగి ఇటువంటి పరిస్థితి రాకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో దళిత నాయకులు ఆందోళన విరమించారు. దీంతో వివాదం సమసిపోయింది.

ముగిసిన ఆహ్వాన నాటికల పోటీలు

తెనాలి అర్బన్, జూలై 9: తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం ముగిశాయి. ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. మంగళవారం కపిరాజు, నాన్న నేనొచ్చేస్తా నాటికలు ప్రదర్శించారు. అనంతరం ఈదర శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు మాట్లాడుతూ, రంగస్థల కళలను, కళాకారులను తెనాలి ఆదరిస్తున్న తీరు అభినందనీయమన్నారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, తెనాలి ప్రాంతం కళలకు కళాకారులకు నిలయమన్నారు. రోటరీ క్లబ్ కార్యదర్శి మురళీకృష్ణ, కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, గరికపాటి సుబ్బారావు, బత్తుల వెంకటేశ్వరరావు, నల్లూరి వెంకటేశ్వరరావు, అయినాల మల్లేశ్వరరావు, ఈదర పూర్ణచంద్, డీఎల్ కాంతారావు, నన్నపనేని ముకుందరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ఇంద్రప్రస్థం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన స్వప్నం రాల్చిన అమృతం, తృతీయ ప్రదర్శనగా కపిరాజు, జ్యూరీ ప్రదర్శనలుగా అందిన ఆకాశం, నాన్న నేనొచ్చేస్తా నాటికల కళాకారులకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా గోపరాజు విజయ్, నాగభూషణం, వేణుగోపాల్ వ్యవహరించారు.


కపిరాజు నాటికలో సన్నివేశం

ప్రజలకు నాణ్యమైన ఇసుక ఉచితంగా ఇవ్వడమే లక్ష్యం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే తెలుగుదేశం కూటమి విధానమని, పారదర్శకత, ముందుచూపుతో ఉచిత ఇసుక పాలసీని రూపొందించామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నెలలోనే కూటమి ఎన్నికల హామీల అమలుకు చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ఉచితంగా ఇసుకను ఇస్తామన్న హామీని నిలబెట్టుకున్న చంద్రబాబు సామాన్యులకు భారీ ఊరట కల్పించారని, దాంతో పేదల సొంతింటి కల తీరనుందని అన్నారు. వైసీపీ హయాంలో ఇసుక మాఫియా దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. జగన్ హయాంలో 50 వేల కోట్ల రూపాయలు ఇసుక మాఫియా దోచుకున్నారని ఆయన ఆరోపించారు. నాసిరకం మద్యం పాలసీని అమలు చేసి జగన్‌రెడ్డి వేల కోట్ల రూపాయల దోపిడీకి తెరలేపిన సంగతి గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇసుక లేక వివిధ వృత్తుల వారు, భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, పేదవాడు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజామాష్టారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే అమల్లోకి తెచ్చారని అన్నారు. సమావేశంలో దామచర్ల శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, బొబ్బిలి రామారావు, మేళం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్


డేగల ప్రభాకర్

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయమని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ నగర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెలరోజులలో అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ఉచిత ఇసుక పాలసీ అమలుతో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తుందన్నారు. నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉండాలన్నదే టీడీపీ విధానమని అన్నారు. గత జగన్‌రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియాను నడిపిందని ఆరోపించారు. ఒక్క ఇసుక కుంభకోణం ద్వారానే రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని మండిపడ్డారు. వైసీపీ నేతలు స్వయంగా ఇసుకాసుర అవతారమెత్తి దోచుకున్నారు. వైసీపీ నేతలు మింగేసిన ఇసుకతో దాదాపు 10 లక్షల పైగా ఇల్లు కట్టుకునేవారని, దానినిబట్టి వారి అవినీతి ఏ స్థాయిలో అవినీతి చేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. పారదర్శకత, ముందుచూపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక పాలసీ రూపొందించారన్నారు. ఉచిత ఇసుక విధానం వల్ల ఎన్నో లక్షల కుటుంబాలకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడమే కూటమి లక్ష్యమన్నారు.

రక్షణ దళాల్లో యువతకు విస్తృత ఉద్యోగావకాశాలు

● ఐఎన్ఏ సబ్- లెఫ్టినెంట్ సాయి రామ్

గుంటూరు(విద్య), జూలై 9 : భారత రక్షణ దళాలలోని ఉద్యోగావకాశాలను సద్వినియోగించుకొంటూ, దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని ఇండియన్ నావెల్ అకాడమీ (కేరళ) సబ్-లెఫ్టినెంట్ సాయి రామ్ అన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సాయిరామ్ మాట్లాడుతూ భారత రక్షణ దళాల్లో విద్యాభ్యాస సమయంలోనే విద్యార్థులు ఒక మంచి జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని, దాని సాధనకు కృషి పట్టుదలతో నిత్యం ప్రయత్నించాలని, భారత సైనిక త్రివిధ దళాలలోని సైనికులకు ఉద్యోగ భద్రతతో పాటుగా, కుటుంబ సభ్యులకు ప్రత్యేకమైన విద్యా, వైద్య సేవలతో పాటుగా వివిధ రకాల సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వం నుండి లభిస్తాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వి శ్రీనివాసరావు, కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ వి.తారాచంద్ పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సాయిరామ్

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపడమే లక్ష్యం

● కేంద్రీయ విద్యాలయ చైర్మన్ రవికుమార్

గుంటూరు(విద్య),జులై 9: స్థానిక నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయలో ప్రాంతీయ స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. అండర్-17 స్థాయి విద్యార్థినులకు రెండు రోజుల పాటు కబడ్డీ పోటీలను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ హనీ మెహతా వెల్లడించారు. వివిధ క్లస్టర్ల నుంచి 84 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వివరించారు. బాలికల నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ముఖ్యఅతిథి, కేవీ చైర్మన్ బి.రవికుమార్ వెల్లడించారు. కేవీఎస్ హైదరాబాద్ ప్రాంతీయ స్థాయి బాలికల కబడ్డీ అండర్-17 పోటీల్లో అనంతపురం కేవీ కబడ్డీ జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.లక్ష్మి ప్రసన్న, హెచ్‌ఎం ఎస్.ఆనంద్, సునీల, పీఈటీ అంజలి, ఆర్ చాంగ్, శ్రీనివాసరావు పర్యవేక్షించారు.


విజేతలకు కప్ అందజేస్తున్న ప్రిన్సిపల్ హనీమెహతా

దిక్సూచి DIKSUCHI

ఐఎస్‌బీలో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)- మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్, మొహాలీ క్యాంపస్‌లు వీటిని అందిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 28**
- **వెబ్‌సైట్: isb.edu**



పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు

పీజీపీ ఇన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానంగా పరిగణిస్తారు. ఇందులో భాగంగా ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కూడా ఉంటుంది.

అర్హత: ఏదేని డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జీమ్యాట్/జీఆర్ఈ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15

పీజీపీఎంఏఎక్స్: ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. దీనిని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు, బిజినెస్ ఓనర్స్‌కు ఉద్దేశించారు. ఇది ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ డిగ్రీకి సమానం. ప్రోగ్రామ్ మొత్తానికి 24 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: ఏదేని డిగ్రీ/సీఏ/ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 1

పీజీపీప్రో: ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. ముంబై, బెంగళూరు క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇది వీకెండ్ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు సమానం. ఫైనాన్స్, మార్కెటింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 18

పీజీపీఎంఎఫ్‌బీ: ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది మాడ్యులర్ ప్రోగ్రామ్. దీనిని కుటుంబ పరంగా సొంత బిజినెస్‌లు నిర్వహిస్తున్నవారికి ఉద్దేశించారు. ఇందులో బిజినెస్ ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్ మెథడాలజీ, టూల్స్ అండ్ టెక్నిక్స్, లీడర్‌షిప్ టెక్నిక్స్ నేర్పిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా రెండు ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

అర్హత: ఏదేని డిగ్రీ/సీఏ ఉత్తీర్ణులై ఉండాలి. అనుభవం తప్పనిసరి కానప్పటికీ కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.15,000

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మొదటి రౌండ్‌కు నవంబరు 10; రెండో రౌండ్‌కు 2025 మార్చి 9

అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్(ఏఎంపీబీఏ)

ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది హైబ్రిడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్. ప్రోగ్రామ్‌లో భాగంగా డేటా మేనేజ్‌మెంట్, ప్రోగ్రామింగ్, స్టాటిస్టిక్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిజినెస్ అప్లికేషన్స్ అంశాలకు సంబంధించి థియరీ సెషన్స్, ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటాయి. ఫౌండేషనల్ ప్రాజెక్ట్‌లు, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు పూర్తిచేయాల్సి ఉంటుంది. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ఇంజనీరింగ్, టెక్నాలజీ, స్టాటిస్టిక్స్, మేథమెటిక్స్, సైన్స్ విభాగాల్లో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్, ప్రోగ్రామింగ్ అంశాల్లో పూర్తి పరిజ్ఞానం ఉండాలి. అడ్మిషన్ నాటికి కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. జీమ్యాట్/జీఆర్ఈ/క్యాట్/ఎన్‌మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు.

‘సర్దార్ పటేల్’ టెక్స్‌టైల్ స్కూల్లో డిగ్రీ, ఎంబీఏ

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, కోయంబత్తూరులో నిర్వహిస్తున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్స్‌టైల్స్ అండ్ మేనేజ్‌మెంట్(ఎస్‌వీపీఐటీఎం)-డిగ్రీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్(ఎస్‌వీపీఈటీ)/సీయూఈటీ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఇతర మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌లను కూడా అనుమతిస్తారు.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: మూడేళ్ల వ్యవధి గల బీఎస్సీ (టెక్స్‌టైల్స్/టెక్నికల్ టెక్స్‌టైల్స్), బీబీఏ టెక్స్‌టైల్ బిజినెస్ అనలిటిక్స్; నాలుగేళ్ల వ్యవధి గల బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఇవి ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లు. బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో మూడేళ్ల కోర్సు పూర్తిచేసిన తరవాత బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్) డిగ్రీతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది.

ఎంబీఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మేనేజ్‌మెంట్, రిటైల్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్, టెక్స్‌టైల్ బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

ఎస్‌వీపీ ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంట.

షార్ట్ టర్మ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు: మెడికల్ టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, నాన్ వోవెన్ టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అప్లికేషన్స్ ఇన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మొదటి రెండు ప్రోగ్రామ్‌ల వ్యవధి 30 గంటలు. చివరి ప్రోగ్రామ్ వ్యవధి 15 గంటలు. వీటిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.svpitm.ac.in

‘దిక్సూచి’ వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/SCMrlySలో చదవండి.

SCHOLARSHIP ALERT

Description: An initiative of Aadhar Housing Finance Limited(AHFL) to ensure equal educational opportunities for all physically disabled students, irrespective of their geographical location, gender, or socio-economic condition.

Aadhar Kaushal Scholarship Program for Youth with Disabilities

Eligibility: Students with physical disabilities pursuing general or professional undergraduate courses across India. Pan-India students can apply. Students must have achieved a minimum of 60% marks in the preceding academic year. Applicants with a gross annual family income of up to INR 2.5-3 lakh are eligible to apply.

Prizes & Rewards: Scholarship between INR 10,000 - INR 50,000 **Last Date:** 23-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/AKSP1

Muskaan Scholarship Program

Description: A CSR initiative by Valvoline Cummins to offer financial assistance and mentorship support to children of commercial drivers(LMV/HMV), mechanics and individuals from the Economically Weaker Section (EWS) category, ensuring continuity in their education.

Eligibility: Students studying in Classes 9 to 12 from the southern, eastern, and north-eastern states (Assam, Manipur, Nagaland, Mizoram, Tripura, Aru nachal Pradesh, Sikkim, Odisha, Bihar, Puducherry, Chhattisgarh, Kerala, Telangana, Andhra Pradesh, Jharkhand, Karnataka, Meghalaya, Tamil Nadu, and West Bengal) are eligible to apply. The scholarship is available to children of commercial drivers (LMV/ HMV), mechanics and children from the Economi cally Weaker Section (EWS) category. Applicants must have scored 60% or above in their previous class to be eligible. The total family income from all sources should not exceed INR 8 lakh per annum.

Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support

Last Date to Apply: 03-09-2024

Application mode: Online Application only

Short Url: www.b4s.in/aj/MKSP1

IDFC FIRST Bank MBA Scholarship

Description: IDFC FIRST Bank MBA Scholarship is a need-based scholarship program run by IDFC FIRST Bank to financially support students with a family income of less than INR 6 lakh per annum. The purpose of this scholarship is to make post-graduate studies in business management accessible to meritorious students who are unable to pursue higher studies due to financial constraints.

Eligibility: Indian students enrolled in the first year of a 2-year full-time MBA program for the class of 2024 at selected educational institutions may apply for this scholarship. Applicants' gross annual family income should be less than or equal to INR 6 lakh. Applicants must have a valid mobile number linked to their Aadhaar number.

Prizes & Rewards: INR 2 lakh for 2 years of MBA studies (INR 1 lakh/year)

Last Date to Apply: 31-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/IFBMS5

buddy4study.com


నవ్య | చిత్రజ్యోతి

వెబ్ సిరీస్‌లో త్రిష



హీరోయిన్ త్రిష తొలిసారిగా ఓ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు. అనూహ్యమైన మలుపులతో, ఉత్కంఠభరితంగా సాగే ఆ సిరీస్ పేరు ‘బృంద’. సోనీ లివ్‌లో ఆగస్టు 2న ఇది స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, మరాఠి, బెంగాలీ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుండడం విశేషం. ఈ సిరీస్ గురించి దర్శకుడు సూర్య మనోజ్ వంగాల మాట్లాడుతూ ‘ఆద్యంతం సస్పెన్స్‌తో ‘బృంద’ సిరీస్ సాగుతుంది. శక్తిమంతమైన ఫీమేల్ లీడ్ నేరేటివ్ స్టోరీ ఇది. దీన్ని చూశాక ఇప్పటిదాకా నమ్ముతున్న నమ్మకాల మీద ఫోకస్ పెరుగుతుంది. ఈ జోనర్‌లో వచ్చే సినిమాలకు కొత్త నిర్వచనం చెప్పేలా ఉంటుంది’ అన్నారు. సూర్య మనోజ్ వంగాల, పద్మావతి మల్లాది కలసి రూపొందించిన స్క్రీన్‌ప్లే సిరీస్‌కు హైలైట్ అవుతుందని అంటున్నారు. డ్రామా, క్రైమ్, మిస్టరీ అంశాలతో రూపొందిన ఈ సిరీస్‌కు శక్తికాంత్ కార్తిక్ సంగీతం అందించారు. దినేష్ కె బాబు ఛాయాగ్రాహకుడు. ఇంద్రజిత్ సుకుమారన్, జయప్రకాశ్, ఆమని, రవీంద్ర విజయ్, ఆనంద్ సామి, రాకేందు మౌళి తదితరులు నటించారుజ

కేస్ నంబర్ 15 ఏమిటి?



అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియ సెజల్, చమ్మక్ చంద్ర, చిత్రం శ్రీను ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం ‘కేస్ నం.15’. తడకల వంకర్‌రాజేశ్ స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న ‘కేస్ నం.15’ ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా తడకల వంకర్‌రాజేశ్ మాట్లాడుతూ “సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలోని సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి. సినిమాను ఎక్కడా రాజీ పడకుండా తెరకెక్కించాం. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ మంచి పేరు వస్తుంది” అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఆర్.కె.స్వామి, సినిమాటోగ్రఫీ: ఆనమ్ వెంకట్, సంగీతం: జాన్.

భారతీయుడు-2 బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు





భారతీయుడు-2 సినిమా బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి మద్దతుగా నటుడు కమల్‌హాసన్‌తో పాటు చిత్ర బృందం శంకర్, సిద్ధార్థ, సముద్రఖని కలిసి డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా అవగాహన వీడియో రూపొందించడం హర్షించదగ్గ విషయమన్నారు. కాగా గత వారం కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద యాంటీ నార్కొటిక్స్ బ్యూరోకు కొత్త వాహనాలు ప్రారంభించిన సమయంలో డ్రగ్స్ నిర్మూలనకు సినీ పరిశ్రమ తమ వంతు సహకారం అందించాలని సీఎం సూచించారు. ప్రతి సినిమా విడుదల సమయంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నటీనటులు కనీసం రెండు నిమిషాల నిడివితో వీడియో చిత్రీకరించి ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు సినీ ప్రముఖులు, క్రీడా కారులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు.

నా మాటల్ని అపార్థం చేసుకున్నారు

‘భారతీయుడు 2’ ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తను మాట్లాడిన మాటల్ని అపార్థం చేసుకున్నారని సిద్ధార్థ్ చెప్పారు. డ్రగ్స్ కట్టడికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తాను. సీఎం సార్.. మేం ఎప్పుడూ మీతోనే” అంటూ ప్రత్యేకంగా విడుదల చేసిన వీడియోలో ఆయన పేర్కొన్నారు.

వినోదాత్మకంగా పేకమేడలు



‘నా పేరు శివ’, ‘అంధగారం’ ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న వినోద్‌కిషన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం ‘పేకమేడలు’. అనూష కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో ‘ఎవరికీ చెప్పొద్దు’ సినిమా ఫేమ్ రాకేశ్ వర్రే సినిమాను నిర్మిస్తున్నారు. టీజర్, పాటలు లాంచ్ చేసి.. ఇప్పటికే పలు రకాల విభిన్న ప్రమోషన్ కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకుంది చిత్రబృందం. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ “సామాన్యుల జీవితాల్లో జరిగే సంఘటనల ఆధారంగా ఈ సినిమా కథను రాసుకున్నాను. వినోదంతో పాటు భావోద్వేగాలను మిళితం చేసిన సినిమా ఇది” అని అన్నారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ “ఇది కేవలం ఒక వినోదాత్మక చిత్రమే కాదు.. ఒక భార్య తన భర్తకు అన్ని వేళలా ఎంతగా సపోర్ట్ చేస్తుందో చూపించే చిత్రం” అని చెప్పారు. “ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను” అని హీరో వినోద్‌కిషన్ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, డీఓపీ: హరిచరణ్.కె, సంగీతం: స్మరణ్‌సాయి.

దర్శకుడే హీరో!

కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎక్కువగా లభిస్తున్న ప్రస్తుత తరుణంలో దర్శకనిర్మాతలు ఇప్పుడు విభిన్న కథాంశాలను ఎన్నుకుంటూ చిత్రాలు నిర్మిస్తున్నారు. ఆ కోవలో వస్తున్న మరో చిత్రం ‘కళింగ’. ఇంతకుముందు ‘కిరోసిన్’ చిత్రంలో నటించిన ధ్రువ వాయు ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు కూడా ఆయనే. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సీనియర్ రైటర్ విజయేంద్రప్రసాద్ విడుదల చేశారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు



మామిడి హరికృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోస్టర్‌లో హీరో, అతని వెనుక ఉగ్ర రూపంలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి విగ్రహం, హీరో చేతిలో కాగడ.. ఇవన్నీ సినిమా మీద ఆసక్తి పెంచుతున్నాయి. ప్రగ్యా నయన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ‘ఆడుకాలం’ నరేన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, తనికెళ్ల భరణి, సమ్మెట గాంధీ, బలగం సుధాకర్, సంజయ్‌కృష్ణ, హరిశ్చంద్ర తదితరులు ఇతర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్.

ఈ గ్యాప్ నాకు చాలా నేర్పింది



‘నన్ను దోచుకుందువటే’ చిత్రంతో ఆరంగేట్రం చేసి.. వరుస సినిమాల్లో నటించారు నభా నటేశ్. కానీ 2021లో వచ్చిన ‘మాస్ట్రో’ సినిమా తర్వాత తెరపై కనిపించలేదు. ఈ విరామానికి కారణాన్ని ఆమె లేటెస్ట్‌గా నటించిన ‘డార్లింగ్’ సినిమా ట్రైలర్ లాంచ్‌లో తెలిపారు. “2022లో నాకు యాక్సిడెంట్ అయ్యింది. ఆ సమయంలో నా చేతిలో మూడు ప్రాజెక్ట్స్ ఉన్నందున.. వాటిని పూర్తి చేసేందుకు సర్జరీ చేసుకుని తగినంత విరామం లేకుండా సెట్స్‌లో అడుగుపెట్టాను.. దాంతో ఆ గాయం తిరగబెట్టింది. అందుకే ఇన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇప్పటివరకూ నేను గ్లామరస్ పాత్రలే ఎక్కువ పోషించాను. ఈ గ్యాప్ నాకు చాలా నేర్పింది. ఇప్పటి నుంచి నటనా ప్రాధాన్యమున్న పాత్రల్లోనూ నటించాలనుకుంటున్నాను. అందుకే స్క్రిప్‌ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాను” అని చెప్పారు. నభా నటించిన ‘డార్లింగ్’ చిత్రం ఈ నెల 19న విడుదల కానుండగా, ఆమె నటిస్తున్న ‘స్వయంభు’ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

నాగులాపురం నాగమ్మ



మంచు లక్ష్మీ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడికల్ డ్రామా ‘ఆది పర్వం’. శివకంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోనా, శ్రీజిత ఘోష్, సుహాసిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో ఎమ్.ఎస్.కె.రచన నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా సాంగ్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సంజీవ్ మేగోటి మాట్లాడుతూ “ఈ సినిమాలో మంచు లక్ష్మీ ‘నాగులాపురం నాగమ్మ’గా నటిస్తున్నారు. ఆ పాత్రలో ఆమె నట విశ్వరూపం చూస్తారు. ఆమె చేసిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాకే హైలైట్” అని చెప్పారు. “ఆదిపర్వం’ మీ అందరికీ నచ్చేలా ఉంటుంది” అని మంచు లక్ష్మీ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: పవన్ శేఖర్ పసువులేటి, సినిమాటోగ్రఫీ: ఎస్.ఎస్.హరీశ్, సంగీతం: మాధవ్ సైబా, సంజీవ్ మేగోటి, బి.సుల్తాన్ వలి, ఓపెన్ బనానా, లుబెక్ లీ మార్విన్.

గుండెపోటుతో ఉషా ఉతప్ భర్త కన్నుమూత



ప్రముఖ గాయని ఉషా ఉతప్ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆమె భర్త జానీ చాకో ఉతప్ సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయసు 78 ఏళ్లు. కోల్‌కతాలోని వారి ఇంట్లో టీవీ చూస్తున్న సమయంలో ఆయనకు గుండె పోటు రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆయన మరణించారని వైద్యులు తెలిపారు. ఈ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

‘చిత్రజ్యోతి’లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sLtj82Y లో చదవండి.



పవర్ లిఫ్టర్ నాగజ్ఞానదివ్యను సత్కరిస్తున్న గ్రామ సర్పంచ్ ప్రసాద్, కొండలు తదితరులు

పవర్ లిఫ్టర్ నాగజ్ఞానదివ్యకు సత్కారం

తెనాలి, మారీసుపేట జూలై 9: నేషనల్ సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో స్వర్ణ పతకాన్ని సాధించిన నాగజ్ఞానదివ్యను ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని కొలవరంలో మంగళవారం పవర్ లిఫ్టర్ నాగజ్ఞానదివ్య గత నెల 6వ తేదీన రాజస్థాన్ రాష్ట్రంలో జరిగిన నేషనల్ సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో 162.5 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆమెను గ్రామ సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కంచర్ల కొండలు, సతీష్, పానకాలరావు, శ్రీనివాసరావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ఫ్రేముల తొలగింపు

తెనాలి, మారీసుపేట జూలై 9: పట్టణంలో పురపాలక సంఘ అనుమతులు లేని ఫ్లెక్సీ ఫ్రేములను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. పట్టణంలో మంగళవారం రైల్వేస్టేషన్ రోడ్డు, గుంటూరు రోడ్డులో పురపాలక సంఘ అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ ఫ్రేములను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా అసిస్టెంటు సిటీ ప్లానర్ సుబ్బారావు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఆదేశాల మేరకు అనుమతులు లేని ఫ్లెక్సీ ఫ్రేమ్‌లను తొలగించామని తెలిపారు. ప్రతిఒక్కరూ మున్సిపల్ అనుమతి తీసుకొని ఫ్లెక్సీ ఫ్రేములను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మణిద్వీప వాసినికి పూజను నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా మణిద్వీప వాసిని పూజలు

తెనాలి, మారీసుపేట జూలై 9: పట్టణంలోని గంగానమ్మపేటలోని పారడైజ్ గృహ సముదాయంలో మంగళవారం మణిద్వీప వాసినీ మాతకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళ భక్తులచే సామూహిక మణిదీపవర్ణం పారాయణం చేయించారు. ఈ సందర్భంగా వారాహీ అమ్మవారి నవరాత్రులు, ఆషాడ మాసంలో అమ్మవారిని శాకాంబరీ రూపంలో కూడా అలకరించి ప్రత్యేక పూజలను చేయవచ్చునని నిర్వాహకులు తెలిపారు. పురుషసూక్త విధానంలో పూజలను నిర్వహించామని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవాని, నాగమణి, సామ్రాజ్యం, సుశీలమ్మ, జ్యోతి, సుధ, పద్మావతి, స్వరూప, రమణయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



కొల్లిపర ఇసుక స్టాక్ పాయింట్‌లో వెలుగు సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి

కొల్లిపర, జూలై 9: ప్రభుత్వం పేదప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని దీనిపై ఎటువంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర ఇసుక లోడింగ్ స్టాక్ పాయింట్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకురావటం హర్షించతగ్గ విషయమన్నారు. గతంలో సుమారు రూ.7లక్షలతో ఇంటి నిర్మాణానికి ఖర్చు అయితే దాంట్లో గత ప్రభుత్వ ఇసుక విధానం వలన దాదాపు రూ.3.50లక్షలు ఇసుకకే ఖర్చు అయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక పాలసీలో దాదాపు రూ 50లక్షల వేల కోట్లు దోపిడి జరిగిందన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్‌జీటీలు పర్యావరణానికి నష్టం కలుగుతుందని చెప్పినప్పటికి ఇష్టం వచ్చిన రీతిలో ఇసుక, మట్టి దోచుకున్నట్లు తెలిపారు. పేదప్రజల మేలు కోసం కూటమి ప్రభుత్వం లోడింగ్ ఖర్చులు మాత్రమే తీసుకుని ఉచిత ఇసుక అందిస్తున్నట్లు తెలియజేశారు. ఉచిత ఇసుక అక్రమ రవాణా జరుగు కుండా మైనింగ్, పోలీసు, పంచాయతీరాజ్, వెలుగు, రెవెన్యూ శాఖల అధికారులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కె.అమృతరాజు, టీడీపీ, జనసేన నాయకులు బొమ్ము శివారెడ్డి, ఆళ్ళ సురేష్‌రెడ్డి, బి.లంకకోటిరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి: ఏడీఏ

తెనాలి, రూరల్ జూలై 9: విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు నిబంధనలు పాటించాలని ఏడీఏలు నాగేశ్వరరావు, ఉషారాణిలు ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని మారీసుపేటలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా శ్రీ మణికంఠ ఎంటర్‌ప్రైజెస్‌కు సంబంధించిన గోడౌన్‌ను పరిశీలించగా రికార్డుల్లో పొందుపరచని 219.20 మెట్రిక్ టన్నుల ఎరువులను గుర్తించి అమ్మకాన్ని నిలుపుదలచేశారు. విజిలెన్స్ సీఐ సి. మాణిక్యరావు, గుంటూరు టెక్నికల్ ఏవో బి.గౌతమ్ ప్రసన్న, తెనాలి ఏవో జి. ప్రేమసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

తెనాలి అర్బన్, జూలై 9: స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర సహ సంయోజక్ మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలని, దేశం కోసం త్యాగాలు చేసిన వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జాతి పునః నిర్మాణం కోసం పాటుపడుతున్న ఏబీవీపీలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రిన్సిపాల్, నగర గౌరవాధ్యక్షుడు పాటిబండ్ల శ్రీనివాసరావు, దావులూరి హర్షిత, లోకేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆశ్లేష నక్షత్ర సంపూర్ణ శాంతి పూజలు

తెనాలి, మారీసుపేట జూలై 9: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం నందు శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశ్లేష నక్షత్రం వారిచే కాలసర్ప దోషనివారణా హోమంను, పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో నంబూరు వెంకట కృష్ణమూర్తి, గోపు రామకృష్ణ, కోనా నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాపులో నగదు చోరీ

తెనాలి క్రైం, జూలై 9: స్థానిక శివాజీచౌక్‌లోని స్వరాజలక్ష్మి కూల్‌డ్రింక్ షాపులో ఉంచిన నగదు చోరీకి గురైంది. దీనిపై ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూల్‌డ్రింక్ షాపు యజమాని తోట శ్రీనివాసరావు తన అవసరాల నిమిత్తం నాలుగు రోజుల నుంచి స్నేహితులు, బంధువుల వద్ద నుంచి రూ.8లక్షలు నగదు అప్పుగా సేకరించారు. ఆ నగదును షాపులోని బీరువాలో ఉంచుకున్నాడు. మంగళవారం ఉదయం 11గంటల సమయంలో షాపు తెరవడానికి రాగా షాపునకు వేసిన తాళాలు తీసి ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే షాపులోని బీరువాను పరిశీలించగా బీరువా తాళాలు పగలకొట్టి అందులో ఉన్న రూ.8లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీనిపై ఒన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఇంకా పూర్తి వివరాలు అందవలసి ఉందని పోలీసులు తెలిపారు.



రథంలో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలు, రథోత్సవంలో డప్పు కళాకారుల విన్యాసం

కన్నుల పండువగా జగన్నాథ రథయాత్ర



రథోత్సవంలో బాలికల కూచిపూడి నృత్యం

తెనాలి అర్బన్, జూలై 9: పట్టణంలోని శ్రీజగన్నాథ రథయాత్ర మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. తెనాలి ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో అలంకరించిన రథంలో స్వామివార్ల మూర్తులను ఉంచి పట్టణంలో ఊరేగించారు. శివాజీ చౌక్‌లో రథోత్సవాన్ని ప్రారంభించారు. కూచిపూడి నృత్యాలు, మహిళల కోలాటం, బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు, కనకతప్పెట్ల కళాకారుల విన్యాసాల నడుమ వేలాదిమంది భక్తులు స్వామి వారి రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. స్వామివారి విశిష్టతను మందిర నిర్వాహకులు సింహగౌరిదాస్ భక్తులకు వివరించారు. శివాజీ చౌక్ నుంచి గాంధీచౌక్, నెహ్రూరోడ్డు, ప్రకాశం రోడ్డు, గంగానమ్మపేట నుంచి మెయిన్ రోడ్డు మీదుగా శ్రీవాసవీ ఆలయం రథోత్సవం జరిగింది. అక్కడ మహాహారతి, ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. 108రకాల అన్న ప్రసాదాలను నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. విదేశాల నుంచి భక్తులు పరవశంతో పాటలు పాడుతూ నృత్యం చేస్తూ రథయాత్రలో పాల్గొని ఆకట్టుకున్నారు. ముకుంద మాదవదాస్, చక్రధారిదాస్, కొత్త సుబ్రహ్మణ్యం, ముమ్మలనేని జానకిరామచంద్రరరావు, కృష్ణమూర్తి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌పై అవగాహన నామమాత్రమే

- ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతా పరీక్షలు
- రైతుల్లో కొరవడిన అవగాహన
- అందుబాటులో లేని మట్టి నమూనా పరీక్షలు
- రైతులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని రైతుసంఘాల మనవి



తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులోని అగ్రీ టెస్టింగ్‌ల్యాబ్, ల్యాబ్‌లో పరీక్షించిన విత్తనాలకు వచ్చిన మొలకలు

తెనాలి రూరల్, జూలై 9: వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసినవే అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌లు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటివి అగ్రీ ల్యాబ్ ద్వారా అక్కడ ఉన్న సిబ్బంది వాటిని పూర్తిగా పరీక్షించి కల్తీవా లేక నాణ్యమైనవా అన్న విషయాలను వెల్లడిస్తారు. తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో అగ్రీల్యాబ్‌ను ఏర్పాటుచేశారు. వ్యవసాయానికి ప్రధాన పాత్రపోషించే విత్తనాలలో కల్తీలకు ఆస్కారం లేకుండా ఈ ల్యాబ్ ద్వారా పరీక్షలు జరపవచ్చు. ఇందుకు ఇక్కడ సిబ్బంది అందుబాటులో ఉంటారు. రైతులు పంట పొలాల్లో విత్తనాలు నాటే క్రమంలో ముందుగా ఈ ల్యాబ్‌కు దాదాపుగా రకాన్ని బట్టి లాట్‌లో సుమారుగా 1కేజీ విత్తనాలను శాంపిల్స్ తీసుకువస్తే వాటిని ల్యాబ్‌లో సిబ్బంది టెస్టింగ్ చేస్తారు. త ద్వారా విత్తనం మంచిదా లేదా కల్తీనా అనే విషయాన్ని తొలిలోనే అంచనా వేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంది. ఈ టెస్టింగ్ అనంతరం దిగుబడి శాతాన్ని కూడా ముందుగానే అంచనా వేయవచ్చు. అయితే వీటిపై రైతులకు అవగాహన లేకపోవడంతో వీటి సేవలు సద్వినియోగం చేసుకునేవారు స్వల్పంగా ఉన్నారు. తెనాలి మార్కెట్ యార్డు ప్రాంతంలో ఏర్పాటు చేసిన అగ్రీ టెస్టింగ్‌ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు పూర్తి ఉచితంగానే పరీక్షలు చేసి మంచివా కాదా అన్న విషయాన్ని కేవలం 15రోజుల్లోనే తెలుపుతారు. దీంతో సాగుకు ముందే రైతులు వారు ఎంపిక చేసుకున్న విత్తనాలను ల్యాబ్ సిబ్బందిని సంప్రదించి ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబరు చెబితే పూర్తి ఉచితంగా మొలకశాతాన్ని చెబుతారు. ఎరువులు, పురుగుమందులు వాడే విషయంలో కూడా తప్పనిసరిగా వీటి సేవలు సద్వినియోగం చేసుకుంటే అన్నదాతలు మంచి దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

ల్యాబ్‌పై అవగాహన పెంచాలి

అగ్రీ ల్యాబ్ ప్రారంభించిన నాటి నుంచి వీటి సేవలు పొందేవారు నామమాత్రంగానే ఉన్నారు. ఏటా ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో ఆయా భూములకు అనువుగా పంటలు సాగుచేస్తుంటారు. సాగుకు ముందు వ్యవసాయశాఖ, ఇతర శాఖల అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి విత్తన పరీక్షలపై అవగాహన కల్పించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు రైతు సంఘాల నాయకుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అగ్రిటెస్టింగ్ ల్యాబ్ సేవలపై గ్రామ గ్రామాన రైతులకు తెలిపి కల్తీవిత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బారినపడకుండా అన్నదాతలు వీటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరుతున్నారు.

అందుబాటులో లేని మట్టినమూనా పరీక్షలు

సాగుచేపట్టే భూముల్లో భూసారం ఎంత ఉంది అన్న విషయాన్ని ప్రతి ఒక్కరైతు తెలుసుకోవాల్సి ఉంటుంది. సాగు ప్రారంభంలోనే మట్టి పరీక్షలు జరిపి దాని ఫలితాల ఆదారంగా పోషక లోపాలు ఉంటే వాటి నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. విత్తనం మంచిది ఎంచుకున్నా భూమిలో పోషకలోపాలు ఉంటే సకాలంలో ఎదుగుదల లేక దిగుబడి తగ్గేప్రమాదం ఉంటుంది. తెనాలి నియోజవర్గంలో మట్టి పరీక్షలంటూ ప్రత్యేక కేంద్రాలు లేవు. వ్యవసాయశాఖ ద్వారా ప్రతి గ్రామంలో ఏర్పాటుచేసిన ఆర్బీకే కేంద్రాల్లో సిబ్బంది పేర్లు నమోదు చేసుకున్న రైతుల వద్దకు వెళ్లి వారి భూమిల్లో మట్టి నమూనాలను సేకరించి వాటిని గుంటూరు పంపి ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఇందుకు సమయం కూడా ఎక్కువగా ఉండటంతో సకాలంలో లోపాలు గుర్తించే అవకాశం రైతులకు తక్కువగా ఉండటంతో ఈ పరీక్షలపై పెద్దగా ఆసక్తి చూపడంలేదు. దీంతో జింకు వంటి లోపాలు ఉన్న భూముల్లో పంటలు ఎదుగుదల తగ్గి రైతులకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. మట్టిపరీక్షలపై ప్రభుత్వం దృష్టిపెట్టి అగ్రీల్యాబ్ వంటి వాటిల్లోనే ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉచితంగా పరీక్షలు చేస్తున్నాం: టెస్టింగ్‌లాబ్ అధికారి సౌజన్య



అందుబాటులో ఉన్న పరికరాలను చూపుతున్న అధికారి సౌజన్య

రైతులకు మేలు జరిగేలా అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటుచేశారు. కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో రైతులు నష్టపోకూడదన్న ముఖ్య ఉద్దేశంతోనే ఇక్కడ సిబ్బంది పని చేస్తున్నారు. నియోజవర్గవ్యాప్తంగా ఆయా సీజన్లకు అనువుగా రైతులు సాగుచేసే విత్తనాలను తమ వద్దకు తెస్తున్నారు. వీరికి పూర్తి ఉచితంగా మొలకశాతాన్ని వెల్లడిస్తున్నాం. మిరప, కూరగాయలు, వరి, జొన్న, మొక్కజొన్న ఇలా పలు రకాల విత్తనాలను ఇక్కడ పరీక్షించేందుకు అవసరమైన యంత్రసామగ్రి ఉన్నాయి. వ్యవసాయశాఖ ద్వారా ఎక్కువమంది విత్తనాలను పంపుతున్నారు. రైతులు కూడా నేరుగా వచ్చి ఇక్కడసేవలు పొందవచ్చు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

న్యాయాధికారి ఎం.శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి ఎం.శ్రీధర్

తెనాలి క్రైం, జూలై 9: ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగి, ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కోర్టు ప్రాంగణంలో జరిగిన హెల్మెట్ ధారణ అవసరం, మోటారు వాహన చట్టాలపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ నేటి పరిస్థితులు గమనిస్తే బాధ్యతాయుతమైన ఉద్యోగులు, పోలీసులు, యువత గాని 90శాతం మంది హెల్మెట్ ధరించి కనిపించడం లేదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు అనుకోని సంఘటనలు జరిగి ప్రాణాలు కోల్పోతే కన్న తల్లిదండ్రులు, భార్య, బిడ్డలు పరిస్థితులు ఆలోచించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ మాట్లాడుతూ వాహనదారులు మోటారు వాహన చట్టం నిబంధనలను తప్పని సరిగా పాటించాలన్నారు. ఇష్టారాజ్యంగా వాహనాలు నడపటం నేరమన్నారు. అలాంటి వారిపై పోలీసులు, ఎంవీఐ అధికారులు కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపుతున్నారని ఇది మరీ ప్రమాదకరమన్నారు. హెల్మెట్ ధరిస్తే 70శాతం మరణాల సంఖ్యను తగ్గించవచ్చునని వెల్లడించారు. ఎంవీఐ అధికారి రాఘవరావు మాట్లాడుతూ తెనాలి ప్రాంతంలో ప్రతి నెలా 90-100 వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందులో ఒక్క నెలలోనే 30మరణాలు సంభవిస్తున్నాయన్నారు. హెల్మెట్ ధారణ తప్పనిసరి అని హెల్మెట్ ధరించకపోతే 21జీవో ప్రకారం వెయ్యి రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు నిర్లిప్తను విడనాడాలన్నారు. యువత బైక్ రేసుల్లో పాల్గొనడం గాని, అధిక స్పీడులో వెళడం జరిగితే రూ.10వేల వరకు జరిమానా విధించవచ్చునన్నారు. అదేవిధంగా ఎమర్జెన్సీ వాహనాలు, అంబులెన్సులు, ఫైర్ సర్వీసు వాహనాలకు దారిఇవ్వని వాహనదారులపై రూ.10వేల వరకు జరిమానా విధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, పారా లీగల్ సిబ్బంది, తెనాలి, చుండూరు, పొన్నూరు, చేబ్రోలు, అమృతలూరు, కొల్లిపర, కొల్లూరు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆహ్వాన నాటికల పోటీలు

● ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్థం



కపిరాజు , నాన్న నేనొచ్చేస్తా నాటికలో ఓ సన్నివేశం

తెనాలి అర్బన్, జూలై 9: తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం ముగిశాయి. ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. మంగళవారం కపిరాజు, నాన్న నేనొచ్చేస్తా నాటికలు ప్రదర్శించారు. అనంతరం ఈదర శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు మాట్లాడుతూ, రంగస్థల కళలను, కళాకారులను తెనాలి ఆదరిస్తున్న తీరు అభినందనీయమన్నారు. సమాజాన్ని మేల్కొలిపి జాగృతం చేసే కళలను, కళాకారులను ఆదరించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, తెనాలి ప్రాంతం కళలకు కళాకారులకు నిలయమన్నారు. ఎంతో మంది గొప్ప కళాకారులు ఈ గడ్డపై పుట్టారన్నారు. కళలను ప్రోత్సహిస్తున్న దాతలు అభినందనీయులని వారి ప్రోత్సాహంతోనే రంగస్థలం ఇంకా సజీవంగా ఉందన్నారు. రోటరీ క్లబ్ కార్యదర్శి మురళీకృష్ణ, కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, గరికపాటి సుబ్బారావు, బత్తుల వెంకటేశ్వరరావు, నల్లూరి వెంకటేశ్వరరావు, అయినాల మల్లేశ్వరరావు, ఈదర పూర్ణచంద్, డీఎల్ కాంతారావు, నన్నపనేని ముకుందరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ఇంద్రప్రస్థం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన స్వప్నం రాల్చిన అమృతం, తృతీయ ప్రదర్శనగా కపిరాజు, జ్యూరీ ప్రదర్శనలుగా అందిన ఆకాశం, నాన్న నేనొచ్చేస్తా నాటికల కళాకారులకు బహుమతులు అందజేశారు. ఉత్తమ నటుడిగా భాషా, ఉత్తమ నటిగా జ్యోతిరాజ్, ఉత్తమ క్యారెక్టర్ నటునిగా రవీంద్రారెడ్డి, ఉత్తమ సహాయ నటునిగా ఫణీంద్ర, ఉత్తమ సహనటిగా జ్యోతిరాణి, ప్రతినాయకుడిగా దిలీప్, హాస్యనటునిగా వెంకటేశ్వరరావు, రచయిత స్నిగ్ధ, దర్శకుడు రవీంద్రారెడ్డిలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా గోపరాజు విజయ్, నాగభూషణం, వేణుగోపాల్ వ్యవహరించారు.



కొల్లిపర ఇసుక లోడింగ్ స్టాక్ పాయింట్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రమేష్

ఇసుకలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

డీఎస్పీ రమేష్

కొల్లిపర, జూలై 9: ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని దీనిని సక్రమంగా వినియోగించకుండా అక్రమాలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర ఇసుక లోడింగ్ స్టాక్ పాయింట్‌లను ఆయన పరిశీలించారు. రికార్డులను, బిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఇసుకలోడింగ్ స్టాక్ పాయింట్లలలో ప్రభుత్వ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. స్టాక్ పాయింట్లలలో వరుసక్రమంగా ఇసుకలోడ్ చేయాలన్నారు. మున్నంగి, కొల్లిపర స్టాక్ పాయింట్‌లతో పోలీసు సిబ్బందిని కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ రవీంద్రరెడ్డి, ఎఎస్ఐ పోతురాజు తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న హ్యాండ్స్ ఫ్రం హెవెన్ సంస్థ నిర్వాహకులు

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

చేబ్రోలు, జూలై 9: చేబ్రోలు చీలిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం రూ.10వేల విలువగల్గిన నోటు పుస్తకాలు, విద్యా ఉపకరణాలు పంపిణీ చేశారు. హ్యాండ్స్ ఫ్రమ్ హెవెన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏవీహెచ్ ప్రసాద్ చేతుల మీదుగా నోటు పుస్తకాలు, పలకలు, ఇతర ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తాహేరున్నీసా సంస్థ నిర్వాహకులు భద్రావతి, విజయరాజు, కె ఝాన్సీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా బాపనపల్లి

పొన్నూరు టౌన్, జూలై 9: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా పొన్నూరు పట్టణానికి చెందిన బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు మంగళవారం నియమితులైయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ నియామక పత్రాలను అందించారు. బాపనపల్లి గతంలో జిల్లా అధ్యక్షుడిగా పొన్నూరు పట్టణ అధ్యక్షుడిగా రాష్ట్ర ఈసీ మెంబర్‌గా పనిచేశారు. పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీసహస్రలింగేశ్వరస్వామి, శ్రీవీరాంజనేయస్వామి ఆలయాల పాలక మండలి చైర్మన్‌గా పనిచేశారు. బాపనపల్లి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులు కావటంపై ఆర్యవైశ్య ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్యవైశ్య ప్రముఖులు కోట రవిశంకర్, అవ్వారు వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, లింగమల్లు మోహనకృష్ణ, కర్నాటి వెంకటేశ్వరరావు, గోలిశెట్టి రోశయ్య గుప్తా తదితరులతో పాటు పట్టణ ప్రముఖులు, బాపనపల్లికి శుభాకాంక్షలు తెలియజేశారు.



వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఏబీవీపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

పెదకాకాని, జులై 8: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని అఖిలభారత విద్యార్థి పరిషత్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా కంటి పరీక్షలు, 2కే మారథాన్, రక్తదాన శిబిరం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవం, జాతీయ విద్యార్థి దినోత్సవంలను పురస్కరించుకొని కార్యక్రమాలు నిర్వహించినట్లు గుంటూరు జిల్లా కన్వీనర్ మల్లవరపు పవన్ కుమార్ పేర్కొన్నారు. ముందుగా సౌత్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరిగే శివ కుమార్ 2కె మారథాన్ ప్రారంభించి మాట్లాడారు. జాతీయ పునర్నిర్మాణమే ధ్యేయంగా విద్య జీవితం కోసం జీవితం దేశం కోసం అంటూ వివేకానంద చెప్పిన సూక్తులను గుర్తుచేశారు. 75ఏళ్లగా దేశంలోని విద్యార్థులు ఏబీవీపీ అనే నాలుగు అక్షరాల జాతీయ భావాలు కలిగినటువంటి విద్యార్థులను తయారుచేస్తూ విద్యార్థులకు నిత్య ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఏ సమస్యలు వచ్చినా తనదైన శైలిలో నిర్మాణాత్మక ఉద్యమాలు నిర్వహించి విద్యార్థుల శ్రేయస్సు ప్రధాన ధ్యేయంగా ముందుకు నడుస్తున్నదన్నారు. అనంతరం ఏఎన్ యూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోల్ ఉచిత కంటి వైద్య పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మనిషికి ముఖ్యమైన అవయవంగా కళ్ళు ఉంటాయని వాటిని కాపాడుకునేందుకు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. వీటితోపాటు మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను నిర్వహించారు. నీడ్స్ తలసేమియా బ్లడ్ బ్యాంకు సహకారంతో 80 యూనిట్లతో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ కన్నెగంటి నాగార్జునరావు ప్రారంభించారు విద్యార్థులు రక్తదానం చేయడం ప్రాణాలను కాపాడటం వంటి వారి ఉన్నత ఆలోచనలకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యక్షురాలు దావులూరి హర్షిత, ఇంచార్జి మోహన్, కార్యదర్శి మణికంఠ, గుంటూరు టెక్నికల్ సెల్ కన్వీనర్ శివ గణేష్ , అంబటి శాంభవి, హేమంత్, రామ్ సాయి, హరీష్, శివ రామరాజు, నానాజీ, భాను ప్రకాష్, శ్రీనివాస్, యుగంధర్, దత్త, సిద్దు, వినయ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



4 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

చేబ్రోలు, జూలై 9: రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని చేబ్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం సోమవారం అర్ధరాత్రి ఓ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం అందటంతో పోలీసులు సోదాలు నిర్వహించారు. గుంటూరు వైపు నుంచి పొన్నూరు వస్తున్న ఆటోను ఆపి సోదాలు నిర్వహించగా ఆటోలో నాలుగు టన్నుల రేషన్ బియ్యాని గుర్తించారు. రేషన్ బియ్యం గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి సేకరించి పొన్నూరులోని ఓ మిల్లుకు తరలిస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. ఈ సంఘటనలో సుబ్బారావు అనే వ్యక్తితో పాటు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. రేషన్ బియ్యం తరలించటంపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.